# రేవంత్ సీరియస్ కు కారణం ఏమిటీ?

హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్‌లో నేతల తీరే వేరు. సీఎం రేవంత్ వ్యవహారం వేరు. ఆయన ఏం మాట్లాడినా దాని వెనుక ఏదో ఉంటుందని హస్తం పార్టీలోనే చర్చ ఉంటుంది. ఇప్పుడు సీఎల్పీ భేటీలో సీఎం చేసిన కామెంట్స్‌పై కూడా కాంగ్రెస్ పార్టీలో ఇలాంటి డిస్కషనే జరుగుతోందట. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్‌తో మీటింగ్‌లో ఉన్నవారంతా అవాక్కయ్యారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తుంటే పట్టనట్లుగా ఉండటం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారట. మరోవైపు ప్రతిపక్ష పార్టీతో సన్నిహిత సంబంధాలు ఏర్పరుచుకోవడమేంటంటూ నిలదీశారట. బీఆర్ఎస్ నేతలతో సన్నిహితంగా ఉంటే వచ్చే ఎన్నికల్లో మీపై పోటీ పెట్టరని భావిస్తున్నారా..? అంటూ గుస్సా అయ్యారట. ఆల్ ఆఫ్ సడన్‌గా సీఎం ఈ స్థాయిలో కామెంట్స్ చేసేసరికి.. సీఎల్పీ సమావేశంలో ఉన్న ఎమ్మెల్యేలు ఖంగుతిన్నారట. ఈ స్థాయిలో ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్ అవ్వడానికి రీజన్ ఏంటనే దానిపై గుసగుసలు వినిపిస్తున్నాయి. అసెంబ్లీ సమావేశాల మొదటిరోజు మాజీ సీఎం కేసీఆర్ సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సభలో ఉన్న కొంతమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో పాటు మంత్రి తుమ్మల నాగేశ్వరావు స్వయంగా కేసీఆర్ దగ్గరకి వెళ్లి మరీ కుశల ప్రశ్నలు వేశారట. పనిలో పనిగా కేసీఆర్ ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారట. అశ్వారావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ కూడా విడిగా కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారట. కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తన తమ్ముడి కుమారుడి వివాహానికి రావాలని కేసీఆర్‌కు ఇన్విటేషన్ ఇచ్చారు. సభలో కేసీఆర్‌తో ఎమ్మెల్యేలు, మంత్రులు మర్యాదపూర్వకంగా మాట్లాడటం చూసిన సీఎం రేవంత్ రెడ్డి? కేసీఆర్‌తో మాట్లాడిన విషయాన్ని ప్రస్తావించకుండా ఇన్‌డైరెక్టుగా వరుస పెట్టి గుంపులో గోవిందం అన్నట్లుగా అందరికీ చురకలంటించారని ప్రచారం జరుగుతోంది. అంతేకాదు రవీంద్ర భారతిలో జాబ్ పట్టాల పంపిణీ కార్యక్రమంలో కేసీఆర్‌పై రేవంత్ చేసిన



వ్యాఖ్యలు కూడా ఆ ఫ్రస్టేషన్‌లో భాగమే నంటోంది బీఆర్ఎస్. అయితే కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై కొందరు లోలోపల మాట్లాడుతుండగా మరికొందరు బహిరంగంగానే కామెంట్స్ చేస్తున్నారు. కొందరు నేతలు, ఎమ్మెల్యేలు అయితే కొంతకాలంగా బీఆర్ఎస్‌తో సన్నిహిత సంబంధాలు మెయింటెన్ చేస్తున్నారనే డౌట్ సీఎంకు ఉందట. హస్తం గూటికి చేరిన పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో కొందరు ఈ మధ్య రివర్స్ అవుతున్నారన్న టాక్ వినిపిస్తోంది. అలాగే మాజీ ఎమ్మెల్యే కోనప్ప లాంటి వాళ్లు సైతం బహిరంగంగానే కాంగ్రెస్‌ను విమర్శిస్తూ కేసీఆర్‌ను పొగుడుతుండటం లాంటి పరిస్థితులు కూడా సీఎంకు చికాకు తెప్పిస్తున్నాయట. మరోవైపు బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను సైతం నేతలెవరూ సరిగ్గా తిప్పికొట్టకుండా ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా వ్యవహరిస్తుండటం కూడా సీఎం రేవంత్‌కు చిరాకు తెప్పించిదంటున్నారు. ఇప్పుడు అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు కేసీఆర్‌ను పలకరించడం కూడా ఆయనకు పుండు మీద కారం చల్లినట్లు అయిందట. ఇవన్నీ మనసులో పెట్టుకునే ఎవరి పేరు ప్రస్తావించకుండా ఎమ్మెల్యేలందరినీ లెఫ్ట్ అండ్ రైట్ తీసుకున్నారట రేవంత్. సీఎల్పీ మీటింగ్‌లో సీఎం చేసిన కామెంట్స్ వెనుక ఆంతర్యమేంటని కాంగ్రెస్ నేతలు ఆరా తీస్తుంటే.. కేసీఆర్ స్టేచర్‌ను చూసి రేవంత్ ఫ్రస్టేట్ అవుతున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు బీఆర్ఎస్ నేతలు. ఇలా పార్టీ ఎల్పీ మీటింగ్‌లో రేవంత్ చేసిన కామెంట్స్ అటు కాంగ్రెస్‌లో.. ఇటు అపోజిషన్ బీఆర్ఎస్‌తో పాటు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# కేజీబీవీ ప్రారంభమెప్పటికో..?

కొండమల్లేపల్లి : సొం త భవనం కోసం నాలుగేళ్లుగా నిరీక్షించారు. నిర్మాణం పూర్తయ్యిందన్న సంతోషం ఒక వైపు.. రేకుల షెడ్డులో తాము పడ్డ అవస్థలు తీరిపోతా యని అనుకున్న విద్యార్థినుల కల మాత్రం సాకా రం కావడం లేదు. ఏడాదిలో పూర్తి కావాల్సిన కొం డమల్లేపల్లి కేజీబీవీ భవనం నిర్మాణం పూర్తి చేసుకోవడానికి నాలుగేళ్ల కాలం పట్టగా.. నాలుగేళ్లకు నిర్మాణం పూర్తి చేసుకొని నాలుగు నెలలు గడుస్తు న్నా కొండమల్లేపల్లి కేజీబీవీ ఇంకా విద్యార్థినులకు అందుబాటులోకి రాకపోవడంతో విద్యార్థినులు తీవ్ర నిరాశలో ఉన్నారు.

**రేకుల షెడ్డులో విద్యాభ్యాసం**

మండల కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో ఓ ప్రైవేటు రేకుల షెడ్డులో 6 నుంచి 10వ తరగతి వరకు కేజీబీవీని నిర్వహిస్తున్నారు. ఆ షెడ్డులో మౌ లిక వసతులు లేకపోవడంతో విద్యార్థినులు ఇ బ్బందుల నడుమ విద్యను కొనసాగిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఒక్కో తరగతికి 40 మంది చొప్పున దాదాపు 220 మందివిద్య నభ్యసిస్తుండగా అద్దె భవనం రేకుల షెడ్డు కావడంతో అరకొర వస తులతో విద్యార్థినులు ఇబ్బందులకు తదితర సమ స్యలతో ఇప్పటికే సుమారు 30 మంది వరకు విద్యార్థినులు టీసీలు తీసుకొని వేరే పాఠశాలలో చేరారు. దీనికి తోడు వేసవి కావడం రేకుల షెడ్డులో తీవ్రమైన ఉక్కబోతతో విద్యార్థినులు సతమత మవుతున్నారు. రేకుల షెడ్డులో కొనసాగుతున్న కేజీబీవీకి ఆకతాయిల చేష్టలు విసుగు తెప్పిస్తుండడంతో పాటు విద్యార్థినులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తు న్నాయి. గతేడాది అద్దె భవనంలోకి ఓ ఆకతాయి చొర బడడంతో విద్యార్థినులు తీవ్ర భయాందోళనతో కంగారుపడ్డారు. ఈ ఘటన నేపథ్యంలో పోలీసులు సైతం ఇక్కడ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ప్రహరీ సరిగా లేకపోవడంతోనే ఆకతాయిలు ఇక్కడ విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఆకతాయిల చేష్టలతో విద్యార్థినుల తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను అద్దె భవనంలో ఉంచేందుకు జంకుతున్నారు.

**అధికారుల ఉదాసీనత**

సొంత భవనం ఏర్పాటుకు గత ప్రభుత్వం రూ. 3.35 కోట్లు మంజూరు చేయగా 2021లో అప్పటి మంత్రి జగదీశరెడ్డి, అప్పటి ఎమ్మెల్యే రమావత రవీంద్రకుమార్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మొదటి రెండేళ్లు నిర్లక్ష్యంతో నిర్మాణం పూర్తి చేయడంలో జాప్యం జరగ్గా.. స్థానిక నాయకులు, విద్యార్థి సంఘాల ఒత్తిడితో గతేడాది డిసెంబర్ నాటికి ఎట్టకేలకు నిర్మాణం పూర్తి చేసుకుంది. నిర్మాణం పూర్తయి సుమారు నాలుగు నెలలు గడుస్తున్నప్పటికీ ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఇన్నాళ్లు సొంత భవనం లేక ఇబ్బందిపడిన విద్యా ర్థినులు భవన నిర్మాణం పూర్తయినప్పటికీ తమకు అందుబాటులోకి తీసుకురావడంలో జాప్యం జరు గుతోంది. విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు అస హనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఉదా సీన తను విడి భవనాన్ని ప్రారంభించి విద్యార్థినుల కష్టాలను తొలగించాలని కోరుతున్నారు.

# కేఎల్ఐ కింద కొత్త ఆయకట్టు కలేనా ?

**- 13 ఏళ్లు గడుస్తున్నా పూర్తి స్థాయిలో నీరందని పరిస్థితి**

**- సర్వే దశలోనే కొత్త రిజర్వాయర్లు - చివరి ఆయకట్టుకు నీరందక అన్నదాతల ఆవేదన**



నాగర్‌కర్నూల్ : అనేక అభ్యంతరాలు, అడుగడుగునా అవాంతరాలు, నిధుల లేమి మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని (ఎంజీకేఎల్ఐ) నిర్వీర్యం చేస్తోంది. నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలం ఎల్లూరు వద్ద పథకం ప్రారంభమై దాదాపు 13 ఏళ్లు కావస్తున్నా చివరి ఆయ కట్టు వరకు సాగునీరందకపోగా కొత్త ఆయకట్టు స్థిరీక రణ జరగకపోవడం మెట్ట రైతులను నిరాశకు గురి చేస్తోంది. 1996లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలో పథకానికి అంకురార్పణ జరి గింది. పరిమితమైన బడ్జెట్‌తో పనులు ప్రారంభమైనా ఆ తర్వాత ఊపందుకున్నాయి. రెండు లక్షల 40 వేల ఎకరాలకు సాగునీరందించాలనే సంకల్పంతో చేపట్టా రు. నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్, జడ్చర్ల, అచ్చంపేట ప్రాంతాలకు సాగునీరు అందించాలని డిమాండ్ రావడంతో క్రమంగా ప్రాజెక్టు ప్రాధాన్యతలు మారుతూ వచ్చాయి. ఈ క్రమంలో 4.51 లక్షల ఎకరాలకు సాగునీరందించాలని లక్ష్యాన్ని నిర్దేశించగా ఆచరణలో మాత్రం అమలు కావడంలేదు.

**కొత్త ఆయకట్టు స్థిరీకరణ కలేనా ?**

కేఎల్ఐ కింద కొత్త ఆయకట్టును స్థిరీకరించి మెట్ట ప్రాంతాలకు సాగునీరందే అంశం ఈ ప్రాంత రైతుల కు కలగానే మిగిలిపోతుందా అనే సంశయం మొద లైంది. కల్వకుర్తి, అచ్చంపేట బ్రాంచ్ కెనాళ్ల ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరందకపోగా కేవలం 540 చెరువులు, కుంటలను నింపి వాటి ద్వారానే ఆయకట్టుకు నీరందిస్తున్నారు.

**ఆ 45 రిజర్వాయర్ల సంగతేంటి?..** 4లక్షల 51 వేల ఎకరాలకు సాగునీరందించాలని రూపొందించిన ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టుకు కనీసం 45 టీఎంసీల నీరు అవసరమవుతుంది. కేవలం కృష్ణానది వరద జలాలపై ఆధారపడిన ఈ ప్రాజెక్టుకు నీటిని తోడుకునే సమయంలో నిల్వ చేసుకునే రిజర్వాయర్ల సామర్థ్యం లేదు. నార్లాపూర్, సింగవట్నం, జొన్నల బొగుడ, గుడిపల్లి గట్టు రిజర్వాయర్లలో 3 టీఎంసీల లోపు నీటిని మాత్రమే నిల్వ చేసుకునే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో కేఎల్ఐకి 17 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే విధంగా ప్యాకేజీ నెంబరు 28లో మూడు, 29లో 28, 30లో 14 రిజర్వాయర్లు నిర్మించాలని వ్యాప్‌కో సంస్థ పదేండ్ల క్రితం చేసిన సర్వే కార్య రూపం దాల్చలేదు. ఇందుకు సంబంధించిన భూసేకర ణ అంశం కూడా కొలిక్కి రాకపోవడంతో మిగతా రైతుల్లో ఆందోళన నెలకొన్నది.

# బై బ్యాక్ స్కీం పేరుతో భారీ మోసం

హైదరాబాద్ : హైదరాబాద్‌లో మోసాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. అమాయకులే లక్ష్యంగా మోసగాళ్లు రెచ్చిపోతున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలంటూ బురిడీ కొట్టిస్తున్నారు. స్టాక్ మార్కెట్లు, బంగారం, ప్లాట్లపై పెట్టుబడి అంటూ అందిన కాడికి దోచేస్తున్నారు. లక్షలు, కోట్లు సేకరిస్తూ భారీ మొత్తంలో డబ్బులు చేతికొచ్చిన వెంటనే ఉడాయిస్తున్నారు. తాజాగా అలాంటి ఘటనే ఒకటి మహానగరంలో మరొకటి చోటు చేసుకుంది. బై బ్యాక్ స్కీమ్ పేరిట వీ ఓన్ ఇన్‌ఫ్రా సంస్థ 12 కోట్లకు టోకరా పెట్టింది. వీ వోన్‌న్ఫ్రా గ్రూప్‌ను కూకట్‌పల్లి కేంద్రంగా ప్రారంభించిన సురేశ్, వెంకటేశ్, వంశీకృష్ణ.. అమాయకులను నట్టేట ముంచేశారు. ఓపెన్ ప్లాట్లు, బంగారంపై పెట్టుబడులు పెడితే బై బ్యాక్ పాలసీ కింద.. ప్రతి నెలా రిటర్న్ ఇస్తామని, అలాగే 25 నెలల్లో రెట్టింపు లాభాలు ఇస్తామని నమ్మబలికారు. ఏజెంట్లను నియమించుకుని 90 మంది నుంచి ఏకంగా 12 కోట్లు వసూలు చేశారు. అయితే 2 స్కీముల్లో పెట్టుబడి పెటిన వారంతా లాభాల కోసం ఎంత ఎదురు చూసినా నగదు మాత్రం చెల్లించలేదు నిర్వాహకులు. రోజులు, నెలలు గడుస్తున్నా డబ్బులు మాత్రం తిరిగి రావడం లేదు. సంస్థ కార్యాలయానికి వెళ్లినా పొంతన లేని సమాధానాలు ఎదురవుతున్నాయి. మోసపోయామని గ్రహించిన 25 మంది బాధితులు సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ నగదు ఎలాగైనా తిరిగి ఇప్పించాలని కోరారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులు వెంకటేశ్, వంశీకృష్ణను అరెస్టు చేయగా.. ప్రధాన నిందితుడు, కీలక సూత్రధారి సురేశ్ మాత్రం పరారీలో ఉన్నాడు. అతని కోసం తీవ్రంగా గాలిస్తున్నామని, బాధితులకు ఎలాగైనా న్యాయం చేస్తామని ఈవోడబ్ల్యూ పోలీసులు చెబుతున్నారు. ఇక ఇటీవల ఈ-బైక్స్ దందా స్కామ్ బయటపడిన సంగతి తెలిసిందే.. పైకి.. ప్రశాంతంగా కనిపించినా.. లోపల నడిచే దందా వేరే ఉంది. వేలు కట్టండి.. కోట్లు సంపాదించండని ఆశ పెట్టి.. ఫుల్లుగా క్యాష్ చేసుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా విస్తరిస్తున్న ఈ స్కామ్ స్కీమ్.. వేలాది మంది నుంచి డబ్బులు వసూలు చేస్తోంది. ఎలక్ట్రిక్ బైకులని ముందుపెట్టి.. మల్టీ లెవెల్ మార్కెటింగ్ దందాని జోరుగా నడిపిస్తున్నారు. ముందు మీరు 15 వేలు కట్టండి.. మరో ఇద్దరితో చెరో 15 వేలు కట్టించండి. మీకు పది వేలు కమిషన్ వస్తుందని చెబుతున్నారు. అలా.. ఈ బిజినెస్‌లో దిగి కోట్లు సంపాదించామని కూడా చెప్పుకునే వాళ్లున్నారు. ఇది.. ఇలా ఉంటుంది ఈ దందా. పేరుకే.. ఎలక్ట్రిక్ బైకుల బిజినెస్. తెరవెనుక దందా జరిగే దందా వేరే. బైక్ షోరూంలు పెట్టి.. అసలు బైకే కొనాల్సిన అవసరం లేదని వాళ్లే చెబుతారు. ఒకవేళ మీకు బైక్ కావాలంటే.. మిగతా డబ్బులు చెల్లించి బైక్ కూడా తీసుకోవచ్చు. లేదంటే.. వాళ్లిచ్చే ఐడీతో.. వ్యాపారంలోకి దిగొచ్చు.

గతంలో.. ఈ తరహా మోసాలు, స్కీమ్‌లు, స్కామ్‌లు చాలానే జరిగాయి. కొన్ని వందల కోట్లు వసూలయ్యే దాకా బాగానే నడిపిస్తారు. ఓ స్టేజ్ దాటాక.. కింది లెవెల్‌లో లక్షల మంది ఉంటారు. అలా.. వారి కింద జాయిన్ అయ్యేందుకు ఎవరూ ఉండరు. ఆ టైమ్‌కి కంపెనీ పెట్టినోళ్లు జంప్ అయిపోతారు. ఆఖరికి వచ్చేసరికి.. కింది స్థాయిలో ఉన్నోళ్లకి.. డబ్బులు రాక, జాయిన్ అయ్యేందుకు ఎవరూ లేక.. వేలాది మంది కోట్లాది రూపాయలు లాస్ అవుతారు. అప్పుడు.. కొత్తగా డబ్బులు కట్టి జాయిన్ అయినవాళ్లు.. ఎవరిని నిలదీస్తారు? కంపెనీనా? వాళ్లని ఆ స్కీమ్‌లో చేర్పించిన వారినా? ఇప్పటికిప్పుడు.. ఓటూ కంపెనీ బోర్డు తిప్పేస్తే పరిస్థితేంటి? లీగల్‌గానూ ఏమీ చేయలేని పరిస్థితి వస్తే దిక్కెవరు? నష్టపోయిన వాళ్లకు డబ్బును చెల్లించేదెవరు? మొదట్లో కోట్లు సంపాదించుకున్నామని చెప్పిన వాళ్లంతా.. కింది స్థాయిలో ఉన్నోళ్లకి డబ్బులు తిరిగి ఇస్తారా? ఇలా.. అనేక ప్రశ్నలు, సందేహాలున్నాయి.

# పడిపోతున్న పులులు, సింహాలు



గాంధీనగర్ : క్రమంగా తగ్గిపోతున్న పులుల సంతతి పరిరక్షణలో గుజరాత్ లోని గిర్ అభయారణ్యం ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ ఆసియాటిక్ సింహాల సంరక్షణకు అనేక జాగ్రత్తలు తీసుకుంటారు. అయితే.. రాష్ట్రంలోని పులులు పెద్ద ఎత్తున మృత్యువాత పడుతున్నాయని అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. 2024 చివరికి గత రెండేళ్లలో రాష్ట్రంలో 286 సింహాలు చనిపోయాయని గుజరాత్ ప్రభుత్వం అసెంబ్లీలో అంగీకరించింది. వాటిలో 228 సహజ కారణాల వల్ల మరణించగా, 58 అసహజ మరణాలు సంభవించాయని తెలిపంది. ఈ సంక్షోభం చిరుతపులి సంతతికి కూడా విస్తరించినట్లు గణాంకాలతో సహా వెల్లడించింది. చిరుతల్లో గత రెండేళ్ల కాలంలో 456 మరణాలు సంభవించినట్లు గుర్తించిన అధికారులు.. వాటిలో 303 సహజ కారణాల వల్ల, 153 అసహజ కారకాలతో ప్రాణాలు కోల్పోయాయని ప్రకటించిందిగిర్ అభయారణ్యం ద్వారా అనేక జాగ్రత్తలు తీసుకుంటున్న గుజరాత్ రాష్ట్రంలోని ఏటికేటా.. సింహాలు, పులుల్లో అసజహ మరణాల సంఖ్య పెరుగుతుండడం కలవరపెడుతోంది. ఇదే విషయమై ప్రతిపక్ష ఎమ్మెల్యే శైలేష్ పర్మార్ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. ఈ గణాంకాలను రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి వివరణ ఇచ్చారు. రెండేళ్ల క్రితం అంటే 2023లో మొత్తంగా 121 సింహాల చనిపోగా, 2024 నాటికి ఆ సంఖ్య 165కు పెరిగిందని అధికారులు తెలిపారు. ఈ మరణాల్లో పెద్ద సింహాలతో పాటు వాటి పిల్లల్లోనూ మరణాలు కనిపిస్తున్నాయని తెలిసింది. గుజరాత్ అధికారుల నివేదిక ప్రకారం.. 2023 నాటి మరణాల్లో.. మొత్తం 58 పెద్ద సింహాలు చనిపోగా, మరో 63 సింహపు పిల్లలు కూడా ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. ఇక.. 2024 నాటికి ఈ సంఖ్య 85 సింహాలకు పెరగగా.. మరో 80 సింహపు పిల్లలు మృత్యువాత పడ్డాయని తెలిపింది. సింహాల మరణాల్లో సహజ మరణాలు, అసహజ మరణాలుగా వర్గీకరించిన అధికారులు.. సహజ కారణాల వల్ల 102 పెద్ద సింహాలు, 126 పిల్లలు మరణించినట్లు తెలిపారు. అదే సమయంలో అసహజ రీతిలో చనిపోయినట్లుగా గుర్తించిన సింహాల్లో 41 పెద్ద సింహాలు, 17 సింహపు పిల్లలు ఉన్నాయని, ఇవన్నీ అసహజ రీతుల్లో మృత్యువాత పడడవే ఆందోళన కలిగిస్తోందని అంటున్నారు. మొత్తంగా భారత్లో తరిగిపోతున్న సింహాలు, పులల సంరక్షణకు ఎన్నో చర్యలు తీసుకుంటున్నా.. మరోవైపు అంతే స్థాయిలో సంక్షోభం ఇబ్బంది పెడుతోందని అంటున్నారు. ఈ గణాంకాలు గుజరాత్ రాష్ట్రంలో పెరుగుతున్న సంక్షోభానికి ఉదాహరణలు అని చెబుతున్నారు. గుజరాత్ సింహాల సంఖ్య పరిరక్షణ, ఆవాసాల ముప్పుల గురించి ఎన్నో ప్రశ్నలను లేవనెత్తుతున్నాయని అంటున్నారు. సింహాల మరణాల విషయమై ఆందోళనలు కలిగించే విషయాల్ని వెల్లడించిన తర్వాత.. గుజరాత్ ప్రభుత్వం శాసనసభలో చిరుతపులి మరణాలపై ఆందోళనకరమైన గణాంకాలను వెల్లడించింది. 2023లో 225 చిరుతపులుల మరణాలను ప్రభుత్వం నివేదించింది. ఆ మరుసటి ఏడాది 2024లో మరణాల సంఖ్య స్వల్పంగా పెరిగి 231కి చేరుకున్నట్లు తెలిపింది. రాష్ట్రంలోని చిరుతు పులలో 2023లో 154 పెద్ద చిరుతపులులు, 71 పిల్లలు మరణించినట్లు అధికారులు గుర్తించారు. అలాగే.. 2024లో 162 చిరుతపులులు, 69 పిల్లలు చనిపోయినట్లుగా రికార్డులు వెల్లడిస్తున్నాయి. వీటిలో సహజ కారణాల వల్ల 201 పెద్ద చిరుత పులులు, 102 పిల్లలు మరణించినట్లుగా గుర్తించారు. మొత్తం 303 మరణాలు సంభవించాగా.. వాటిలో 115 చిరుత పులులు, 38 చిన్న కూనలు అసహజ రీతుల్లో చనిపోయినట్లుగా తెలిపారు.

# 7 నెలల కనిష్ట స్థాయికి రిటైల్ ఇన్‌ఫ్లేషన్

ముంబై : హోలీ, ఉగాది, రంజాన్ పండుగల సమయంలో దేశ ప్రజలకు పెద్ద శుభవార్త. గత నెల (2025 ఫిబ్రవరి)లో, భారతదేశ రిటైల్ ఇన్‌ఫ్లేషన్ రేటు 7 నెలల కనిష్ట స్థాయికి చేరుకుంది. వినియోగదారుల ధరల సూచీ ఆధారంగా లెక్కించే చిల్లర ద్రవ్యోల్బణం రేటు ఫిబ్రవరిలో 3.61 శాతంగా నమోదైంది. ఇది జనవరి కంటే 0.65 శాతం తక్కువ. గత ఏడాది జులైలో నమోదైన 3.54 శాతం తర్వాత, ఈ ఏడాది ఫిబ్రవరిలో నమోదైన సంఖ్యే అత్యల్పం. దేశంలో ద్రవ్యోల్బణం ఏడు నెలల కనిష్ట స్థాయికి దిగి రావడానికి ప్రధాన కారణం ఆహార ధరలు తగ్గడం. నెల క్రితం, 2025 జనవరిలో రిటైల్ ఇన్‌ఫ్లేషన్ 4.26 శాతంగా ఉండగా; ఏడాది క్రితం, 2024 ఫిబ్రవరిలో ఇది 5.09 శాతంగా ఉంది.

ఆహార ద్రవ్యోల్బణం తగ్గుదల

2025 ఫిబ్రవరిలో ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం 3.75 శాతానికి తగ్గింది. ఈ ఏడాది జనవరిలోని 5.53 శాతంతో పోలిస్తే ఇప్పుడు ఏకంగా 222 బేసిస్ పాయింట్లు తగ్గడం విశేషం. 2023 మే నెల తర్వాత, మళ్లీ 2025 ఫిబ్రవరిలో ఇది అత్యల్ప స్థాయికి చేరుకుంది. ఫిబ్రవరిలో కూరగాయలు, గుడ్లు, మాంసం, చేపలు, పప్పుధాన్యాలు, పాలు, పాల ఉత్పత్తుల ధరలు తగ్గడం ఈ తగ్గుదలలో ముఖ్యమైన పాత్ర పోషించింది. 2024 ఫిబ్రవరితో పోలిస్తే 2025 ఫిబ్రవరిలో అత్యధికంగా తగ్గిన ఆహార ఉత్పత్తులు - అల్లం (-35.81%), జీలకర్ర (-28.77%), టమోటా (-28.51%), కాలీఫ్లవర్ (-21.19%), వెల్లుల్లి (-20.32%). గత ఏడాదితో పోలిస్తే, ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇంధన ధరల్లోనూ ఉపశమనం లభించింది, ఇంటి బడ్జెట్లపై ఒత్తిడి తగ్గింది. ఇంధన ద్రవ్యోల్బణం రేటు 1.33 శాతం తగ్గింది. 2024 ఫిబ్రవరితో పోలిస్తే 2025 ఫిబ్రవరిలో కొన్ని ధరలు పెరిగాయి. అవి - కొబ్బరి నూనె (+54.48%), కొబ్బరి (+41.61%), ఉల్లిపాయలు (+30.42%), పసిడి (35.56%), వెండి (+30.89%).

ప్రాంతాల వారీగా ద్రవ్యోల్బణం గణాంకాలు

పట్టణ ప్రాంత ద్రవ్యోల్బణం ఫిబ్రవరిలో 3.32 శాతానికి దిగి వచ్చింది, ఇది జనవరిలో 3.87 శాతంగా ఉంది.

ఫిబ్రవరిలో, గ్రామీణ ప్రాంత ద్రవ్యోల్బణం 3.79 శాతానికి పరిమితమైంది, జనవరిలో ఇది 4.59 శాతంగా నమోదైంది.

రాష్ట్రాల వారీగా చూస్తే - ఫిబ్రవరిలో, కేరళలో అత్యధికంగా 7.31 శాతంగా ఉంటే, తెలంగాణలో అత్యల్పంగా 1.31 శాతంగా నమోదైంది.

ఆర్‌బీఐకి కూడా ఇది శుభవార్తే

రిటైల్ ద్రవ్యోల్బణం క్రమంగా తగ్గుతూ ఆర్‌బీఐ లక్ష్యమైన 4 శాతం కంటే తక్కువగా నమోదు కావడం ఉండటంతో కేంద్ర బ్యాంక్‌పై ఒత్తిడి తగ్గినట్లైంది. ఆర్థిక వృద్ధిని పరుగులు పెట్టించడానికి ఉ ఉపాధిని పెంచడానికి వడ్డీ రేట్లను మరింత తగ్గించే నిర్ణయం తీసుకోవడానికి ఖీఃఎకి స్వేచ్ఛ దొరికింది. గత నెలలో జరిగిన ద్రవ్య విధాన సమీక్షలో, ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పాలసీ రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించారు. దీంతో, రెపో రేటు 6.25 శాతానికి దిగి వచ్చింది. ద్రవ్యోల్బణాన్ని గమనిస్తూనే వృద్ధికి మద్దతు ఇచ్చే 'తటస్థ వైఖరి'ని కొనసాగించాలని ఆ భేటీలో ఓఖఆ నిర్ణయించింది. దీని అర్థం ద్రవ్యోల్బణం రేటు మరింత తగ్గితే, పాలసీ రేట్లను ఆర్‌బీఐ మరింత తగ్గించగలదు, ఇది ఆర్థిక వ్యవస్థలో వేగం పెంచుతుంది. ద్రవ్యోల్బణం రేటు తగ్గడం సామాన్య ప్రజలకు ఉపశమనం కలిగించడమే కాకుండా, పెట్టుబడి ఉ వినియోగదారుల వ్యయం పెరగడానికి కూడా దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇది ఆర్థిక వ్యవస్థకు సానుకూల సంకేతం.

# రేషన్ నో స్టాక్..

మంచిర్యాల : లబ్ధిదారు లకు రేషన్ సరుకులు పంపణీ చేసే చౌక ధరల దు కాణాలు స్టాక్ లేక వెలవెలబోతున్నాయి. ప్రతి నెల ఒకటి నుంచి 15వ తేదీలోపు రేషన్ షాపుల్లో బియ్యం పోయాల్సి ఉంది. అయితే ఇంకా దాదాపు 40శాతం మేరక స్టాక్ చేరుకో కపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో మొత్తం ఐదు ఎంఎల్ఎస్(మండల్ లెవెల్ స్టాకిస్ట్ పాయింట్) గోదాముల ద్వారా 424 చౌక ధరల దుకాణాలకు బియ్యం సరఫరా కావాల్సి ఉంది.

**ఖాళీగా దర్శనమిస్తున్న ఎంఎల్ఎస్ పాయింట్లు...**

చౌక ధరల దుకాణాలకు రేషన్ బియ్యం సరఫరా చేసే ఎంఎల్ఎస్ పాయింట్లు సరిపడా స్టాక్ లేక ఖా ళీగా దర్శనమిస్తున్నాయి. లబ్ధిదారుల అవసరాలకు సరిపడా బియ్యం మరుసటి నెలకు సంబంధించి న డుస్తున్న నెలలో 25వ తేదీలోపు అందుబాటులో ఉం చాలి. స్టాక్ వివరాల సరి చూసుకొని డీలర్లు ఒకట వ తేదీ నుంచి బియ్యం పంపిణీ చేస్తారు. మార్చి నె లకు సంబంధించి మరో మూడు రోజులే గడువు ముగిసి ఉన్నా... ఇప్పటి దాక ఎంఎల్ఎస్ పాయిం ట్లకు బియ్యం సంబంధిత కాంట్రాక్టర్ల నుంచి చేరక పోవడం గమనార్హం. ఎప్పటికప్పుడు బియ్యం నిల్వలను సరి చూసుకొని అవసరం మేరకు తెప్పిం చాల్సిన పౌరసరఫరాల శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల గోదాములు ఖాళీగా కనిపిస్తున్నాయి.

**సగ భాగం కొరత...**

జిల్లాలోని 424 షాపులకు లబ్ధిదారుల సంఖ్యను బట్టి సగటున ప్రతి నెల 70 క్వింటాళ్ల మేర బియ్యం అవసరం అవుతాయి. అలా జిల్లాలోని ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా రేషన్ షాపులకు సరఫరా చేయ డానికి సుమారు 7 మెట్రిక్ టన్నుల సరుకు సరఫరా జరుగాలి. అయితే ఇప్పటి వరకు అందులో కేవలం సగ భాగం మాత్రమే షాపులకు చేరినట్టు తెలుస్తోం ది. మిగితా స్టాక్ కోసం డీలర్లు ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద పడిగాపులు కాసిన ఫలితం ఉండడం లేదు. దీనితో లబ్ధిదారులకు జవాబు చెప్పలేక షాపులను మూసి ఉంచాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. స్టాక్ వచ్చినప్పుడల్ల తెరిచి అనంతరం మూసి ఉంచక త ప్పని పరిస్థితులు నెలకొన్నాయని స్వయంగా డీలర్లే చెబుతుండడం గమనార్హం.

**తరుచుగా ఇదే తంతు...**

గత కొంతకాలంగా రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు సకాలంలో బియ్యం అందని దాఖలాలు ఉ న్నాయి. కొన్ని సార్లు ఎంఎల్ఎస్ పాయింట్లలో స్టాకు ఉన్న స్టేజ్-1, స్టేజ్-2 కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల బి య్యం పంపిణీ కావడం లేదు. సరైన సమయంలో లారీలు అందుబాటులో ఉంచకపోవడంతో ఈ పరిస్థి తులు నెలకొంటున్నాయి. ఇదిలా ఉండగా మరికొన్ని సార్లు అసలు స్టేషన్-1 కాంట్రాక్టర్ వద్దకే పౌర సర ఫరాల శాఖ నుంచి పంపిణీ జరుగడం లేదనే అభిప్రాయాలు ఉన్నాయి. ఇలా ప్రతి నెల ఏదో తంతు చూపి లబ్ధిదారులను.. షాపుల చుట్టూ తిప్పుకోవడం ఆనవాయితీగా మారింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా బియ్యం ఎప్పుడు పంపిణీ చేస్తారో తెలి యని పరిస్థితులు నెలకొనగా, షాపుల చుట్టూ తిర గాల్సిన దుస్థితి లబ్ధిదారులకు పట్టింది.

రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీ ఈ నెల 15తో గడువు ముగియనుండగా అధికారులు స్పందించి గ డువు పెంచాల్సిన అవసరం ఉంది. పౌరసరఫరాల శాఖ నిర్లక్ష్యం కారణంగా రేషన్ షాపులు ఎంఎల్ఎస్ పాయింట్లలో బియ్యం నిల్వ లేక వెలవెలబోతున్నా యి. అధికారుల తప్పిదానికి లబ్ధిదారులను ఇబ్బందు లు పెట్టకుండా సరిపడా స్టాక్ వచ్చి పంపిణీ పూర్తయ్యే వరకు గడువు పెంచాలనే డిమాండ్లు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఈ దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## సన్నాలకు బోనస్‌ను వెంటనే చెల్లించాలి

దండేపల్లి: అర్హులైన రైతులకు వెంటనే రుణ మాఫీ చేయాలని, సన్నరకం ధాన్యానికి రైతులకు 500 రూపాయల బోనస్ చెల్లించాలని కోరుతూ దండేపల్లిలో ఎల్లయ్యపల్లెలో రైతులతో కలిసి బీజేపీ నాయకులు రాస్తారోకో చేపట్టారు. ఉదయం నుంచే ముందస్తుగా బీజేపీ నాయకులు, కార్యకర్తలను దండేపల్లి ఎస్సై తైసినోద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు వారి ఇళ్లలోకి అరెస్ట్‌చేసి దండేపల్లి పోలీసుస్టేషన్‌కు తరలిం చారు. కొందరు నాయకులు ఆందోళన చేయడానికి నాయకులు వస్తే, ఈ విషయం తెలుసుకున్న దండేపల్లి, జన్నారం ఎస్సైలు తైసినోద్దీన్, రాజవర్ధన్ తమ పోలీసు సిబ్బంది పార్టీ కార్యలయం వద్ద మోహరించారు. వారిని బయటికి రావాలని పోలీసులు పదే పదే చెప్పినప్పటికి వారు వినకుండా పార్టీ కార్యాలయంలో బీజేపీ నాయ కులు పత్తిపాక సంతోష్, గుండ రవీందర్, వనపర్తి రాకేష్, గడికొప్పుల సురేందర్ నిరసన దీక్ష చేశారు. కాగా మరికొందరు నాయకులు రైతులతో కలిసి పోలీసుల కళ్లుకప్పి రోడ్డుపై వచ్చి రాస్తారోకో చేపట్టారు. దీంతో పోలీసులు అక్కడి చేరుకోని వారిని అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ చేసిన నాయకులను సొంత పూచికత్తుపై సాయం త్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు గాదెశ్రీనివాస్ మాట్లాడు తూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా రైతులను మోసం చేస్తోందన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ విజయకు బీజేపీ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు.

## విద్యార్థులతో కలిసి వీసీ భోజనం

విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ క్యాంపస్‌లో ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో తెలుసుకుని, వాటిని పరిష్కరించే దిశగా ముందుకు సాగుతున్నారు. వర్సిటీలో ఉన్న ఇరవైకి పైగా హాస్టళ్లలో వందలాది మంది విద్యార్థులు ఉంటున్నారు. వారికి నాణ్యమైన భోజనం అందించడం అధికారుల బాధ్యత. అయితే, అనేక హాస్టళ్లలో భోజనం బాగుండడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. దీనిపై వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ ప్రత్యేకంగా దృష్టిసారించారు. ప్రస్తుతం గెస్ట్ హౌస్‌లో ఉంటున్న ఆయనకు, ఆయన కుటుంబ సభ్యులకు హాస్టల్ నుంచే భోజనం వెళుతోంది. విద్యార్థులకు వడ్డించే ఆహారాన్నే తనకు పంపించాలని ఆదేశాలు ఇచ్చిన ఆయన...సరిగా లేకపోతే మార్పులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఇందుకయ్యే ఖర్చును ఆయా హాస్టళ్లకు ఆయన చెల్లించనున్నారు. గడిచిన కొద్దిరోజుల నుంచి ఆయన ఒక్కో హాస్టల్ నుంచి భోజనం తెప్పించుకుంటున్నారు. ఇప్పటివరకూ ఇంజనీరింగ్, రీసెర్చ్ స్కాలర్స్, ఆర్ట్స్ కాలేజీలకు చెందిన హాస్టళ్ల నుంచి వచ్చిన భోజనాన్ని రుచిచేశారు. అయితే భోజనం బాగాలేదంటూ కొద్దిరోజుల కిందట విద్యార్థులు ఆందోళన చేయడంతో ఎప్పటికప్పుడు హాస్టళ్లను తనిఖీ చేసేందుకు ఆయన నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ఇందులో భాగంగానే ఆయన గడిచిన రెండు రోజులుగా వివిధ హాస్టళ్లకు వెళ్లి విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్నారు. ఇబ్బందులను విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్నారు. ఇబ్బందులు ఉన్నచోట విద్యార్థులతో మెస్ కమిటీలు వేయడంతోపాటు భోజనం ఎలా ఉందన్న సమాచారాన్ని తెప్పించునేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే, ఆయా హాస్టల్ వార్డెన్లతో ఎప్పటికప్పుడు సమావేశాలు పెట్టాలని నిర్ణయించినట్టు చెబుతున్నారు. మరో వారం రోజుల్లో హాస్టళ్ల నిర్వహణను గాడిలో పెట్టాలని యోచిస్తున్నారు.

## పక్కాగా భూముల రీసర్వే

విశాఖపట్నం : భూముల రీసర్వేలో తప్పులు దొర్లకుండా చూడాలని ప్రభుత్వం గట్టిగా ఆదేశాలు జారీచేసింది. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో జిల్లాలోని మూడు గ్రామాల్లో చేపట్టిన రీసర్వే పనులు చివరి దశకు వచ్చాయి. ఈ నేపథ్యంలో నాలుగు గ్రామీణ మండలాల్లోని మరో ఎనిమిది గ్రామాల్లో రీసర్వేకు తాజాగా నిర్ణయించారు. ఈనెల 20వ తేదీ నుంచి ఎనిమిది గ్రామాల్లో రీసర్వే పనులు ప్రారంభించనున్నారు. పెందుర్తి మండలం పెదగాడి, పినగాడి, ఆనందపురం మండలం గిడిజాల, కుశలవాడ, భీమిలి మండలం తాటితూరు, తాళ్లవలస, పద్మనాభం మండలంలో పాండ్రంకితోపాటు మరో గ్రామాన్ని ఎంపిక చేశారు. ప్రతి గ్రామంలో భూముల రీసర్వేకు ఐదు బృందాలను, రైతులకు సమాచారం ఇవ్వడం, గ్రామ సభల నిర్వహణ, రైతులు, అధికారుల మధ్య సమన్వయం కోసం మరో బృందాన్ని నియమించారు. ప్రతి బృందంలో గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు, ఇతర సిబ్బంది ఉంటారు. ప్రతి గ్రామంలో 250 ఎకరాలను ఒక బ్లాక్‌గా గుర్తిస్తారు. ఆ 250 ఎకరాలకు సంబంధించిన రైతులతో వాట్సాప్ గ్రూపు ఏర్పాటుచేస్తారు. బ్లాక్ పరిధిలో ఏ సర్వే నంబర్‌లోని భూములు ఏ రోజు రీసర్వే చేస్తారనే వివరాలను గ్రూపులో పోస్టు చేస్తారు. ఇప్పటికే సర్వేయర్లు ప్రతి బ్లాకులో రైతుల వివరాలు, ఫోన్ నంబర్లు సేకరించే పనిలో ఉన్నారు. ఈ ఎనిమిది గ్రామాల్లో ఇప్పటికే డ్రోన్ సర్వే పూర్తిచేసిన సర్వే శాఖ రీసర్వేకు అంతా సిద్ధం చేసింది. గొట్టిపల్లి, గంధవరం, దాకమర్రి గ్రామాల్లో కొన్ని వారాలుగా రీసర్వే జరుగుతోంది. జిల్లాలోని 85 రెవెన్యూ గ్రామాలకుగాను 59 గ్రామాల్లో గత ప్రభుత్వం హయాంలో రీసర్వే పూర్తిచేశారు. మిగిలిన గ్రామాల్లో రీసర్వే పనులు పక్కాగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశాలు ఇచ్చారు. ఎక్కడా తప్పులు దొర్లకుండా సర్వేయర్లు అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని సూచించారు.

## పాఠశాలల అభివృద్ధికి నిధులు

విశాఖపట్నం : పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న పనులు (మనబడి-మన భవిష్యత్తు) పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల ఒకటో తేదీన అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పెండింగ్ పనులకు నిధులు కేటాయించింది. ముందుగా జిల్లాల నుంచి పాఠశాల విద్యా శాఖ ఉన్నతాధికారులు సమాచారం తీసుకున్నారు. కొన్ని పాఠశాలల్లో నిర్మించిన అదనపు తరగతి గదులకు ప్లాస్టింగ్ చేసి, పెయింట్ వేస్తే సరిపోతుందని, కొన్నిచోట్ల పాఠశాలలకు పెయింట్ వేయాల్సి ఉందని, అదనపు గదులకు తలుపులు, కిటికీలు బిగించాల్సి ఉందని ఇంజనీర్లు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లు పలు పాఠశాలల్లో పెయింటింగ్ పనులు చేపట్టారు. అయితే కనీసం పార్టు పేమెంట్ కూడా ఇవ్వకపోవడంతో పనులు మధ్యలో విడిచిపెట్టేశారు. అలాగే బిల్లులు ఇవ్వకపోవడంతో పాఠశాలలకు వచ్చిన తలుపులు, కిటికీలు బిగించకుండా మూలన పడేశారు. ఈ వివరాలతో సమగ్రశిక్షా అభియాన్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఈ నేపథ్యంలో తొలివిడత తాజాగా పాఠశాల అభివృద్ధి కమిటీ ఖాతాలకు రూ.1.2 కోట్లు విడుదల చేశారు. పెయింటింగ్ పనులు పూర్తిచేయడానికి సంబంధిత కంపెనీలకు నిధులు విడుదల చేయాలని ఆదేశాలు వెళ్లాయి. వైసీపీ ప్రభుత్వంలో రెండేళ్ల కిందట జిల్లాలోని 319 పాఠశాలల్లో రెండో విడత నాడు-నేడు (ప్రస్తుతం మన బడి-మన భవిష్యత్తుగా పేరు మార్చారు) కింద రూ.115.67 కోట్ల అంచనాతో పనులు చేపట్టారు. అయితే తొలి నుంచి నిధుల సమస్య వెంటాడింది. అనుకున్న సమయంలో పనులు పూర్తికాలేదు. కొన్నిచోట్ల మధ్యలో నిలిచిపోయాయి. అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తిచేసి భవనాలు వినియోగంలోకి తీసుకురావాలంటే రూ.27 కోట్ల నిధులు అవసరమని అంచనా వేశారు. పెయింటింగ్ బకాయిలు ఆరు కోట్ల రూపాయలు వరకూ ఉన్నాయి. అదనపు తరగతి గదులు అందుబాటులోకి తీసుకురావడం కోసం తొలుత రూ.పది కోట్లు అవసరమని చెబుతున్నారు. తాజాగా విడుదల చేసిన రూ.1.2 కోట్లు ఏ మూలకు సరిపడవని పాఠశాలల అభివృద్ధి కమిటీలు వ్యాఖ్యానిస్తున్నాయి. కనీసం రూ.10 కోట్లు ఇస్తే వచ్చే జూన్‌కల్లా మధ్యలో నిలిచిన అదనపు గదులు అందుబాటులోకి వస్తాయని అంటున్నారు. జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు....మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రి నారా లోకేశ్‌తో మాట్లాడి నిధులు విడుదల చేయించాలని పాఠశాలల అభివృద్ధి కమిటీలు కోరుతున్నాయి.



## అసెంబ్లీ స్పీకర్ పై బిఆర్ఎస్ పార్టీ
# అనుచిత వ్యాఖ్యలు సిగ్గుచేటు.

**- జగదీశ్వర్ రెడ్డి, కేటీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం**

**- డిసిసి అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డి**


గజ్వేల్:16 మార్చి 2025 ( ప్రజా కలం ప్రతినిధి) దళితుడైన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై శాసనసభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డిలను వెంటనే శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిసిసి అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం బి ఆర్ ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మలను గజ్వేల్ ఇందిరా పార్క్ చౌరస్తా లో కాంగ్రెస్ పార్టీ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి మాట్లాడుతూ శాసనసభలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ఏకవచనంతో మాట్లాడుతూ ఆగౌరవపరిచి, శాసనసభ సంప్రదాయాలను తుంగలో తొక్కినందుకు, జగదీష్ రెడ్డికి మద్దతుగా నిలిచిన బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశామని తెలిపారు. బిఆర్ఎస్ అధినేత కెసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లకు ఆ పార్టీకే దళితులంటే చిన్నచూపని అన్నారు. రాష్ట్రం ఏర్పాటు కాగానే దళిత ముఖ్యమంత్రిని చేస్తామని మోసం చేశారని, మంత్రి రాజయ్యను కూడా బర్తరఫ్ చేశారని గుర్తు చేశారు. దళితుడైన గడ్డం ప్రసాద్ శాసనసభ స్పీకర్ గా కాంగ్రెస్ పార్టీ నియమిస్తే అధ్యక్షా అని సంబోధించాల్సి వస్తుందని కెసిఆర్ శాసనసభ సమావేశాలకు హాజరు కావడం లేదని తెలిపారు. స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు జగదీశ్ రెడ్డి ని అసెంబ్లీ నుండి బహిష్కరించడమే కాకుండా అతని యొక్క సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఈ సందర్భంగా కోరారు. కెసిఆర్ ప్రభుత్వం అందిస్తున్న జీతభత్యాలను తీసుకుంటూ ప్రజల సమస్యలను పరిష్కరించడం లేదని ఆరోపించారు. గజ్వేల్ ప్రజలు మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించి రెండుసార్లు సీఎం గా మూడోసారి ప్రతిపక్ష నాయకుడిగా హోదా కట్టబెట్టినా కూడా ప్రజల్లోకి వచ్చి సమస్యలు పరిష్కరించకుండా ఫామ్ హౌస్ లోనే తాగి పడుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటివరకు 57 లక్షల జీతభత్యాలను ఎమ్మెల్యేగా కెసిఆర్ తీసుకున్నారని ఎమ్మెల్యేగా బాధ్యతలు తీసుకున్న ఒక్కసారి కూడా ప్రజా సమస్యలను పట్టించుకోలేదని ప్రజలను కలవలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, ఏం సి వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడి పల్లి భాస్కర్, నాయకులు సాజిద్, సుఖేందర్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మారెడ్డి నక్క రాములు గౌడ్, అజహర్, రమేష్ గౌడ్, రాములు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాను విజయవంతం చేయండి

**మొబైల్ అంగన్వాడీ సెంటర్సు వెంటనే రద్దు చేయాలని**

**అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్, మినీ టీచర్స్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి**

**వీటి కోసం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో తగిన కేటాయింపులు పెంచాలి**



మహేశ్వరం, మార్చి 16,(ప్రజా కలం)

తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 17,18 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ముందు జరిగే 48 గంటల ధర్నాను, వంటవార్పును విజయవంతం చేయాలనే పిలుపులో భాగంగా మహేశ్వరం ప్రాజెక్ట్ సీడీపీఓ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు కందుకూరు మండల కన్వీనర్ బుట్టి బాలరాజ్, సిఐటియు మహేశ్వరం మండల కన్వీనర్ ఏర్పుల శేఖర్లు మాట్లాడుతూ దేశంతోపాటు మన రాష్ట్రంలో ఐసిడిఎస్ ప్రారంభమై 50 సంవత్సరాలు అవుతుంది. ఈ కాలంలో ఐసిడిఎస్ సేవలు అనేక మన్ననలు పొందాయి. ఐసిడిఎస్ ను సంస్థాగతం చేయాలని, ఇందులో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ ను పర్మినెంట్ చేయాలని అనేక సంస్థలు మరియు సుప్రీంకోర్టు, గుజరాత్ హైకోర్టు తెలియజేశాయి. ఈ అంశాలను పరిశీలించి పరిష్కారం చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతను నిర్వహించడం లేదు. పైగా పేద ప్రజలతోపాటు అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్కు నష్టం కల్గించే ఐసిడిఎస్ ప్రైవేటీకరణ నిర్ణయాలు అనేకం చేసింది. ఇలాంటి పరిస్థితిలో అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యతిరేక విధానాలను అమలు చేయాలని చూడటం అన్యాయం. ఐసిడిఎస్ అంగన్వాడీ కేంద్రాలకు పోటీగా 3-6 సం?ల పిల్లలతో పిఎం శ్రీ పథకం క్రింద ప్రీ ప్రైమరీ (ఎలిమెంటరీ) కేంద్రాలను 28 జిల్లాల్లో 56 కేంద్రాలను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేసింది. ఈ నిర్ణయం ఐసిడిఎస్ ను నిర్వీర్యం చేసే చర్యలు తప్ప మరొకటి కాదు. దీంతోపాటు రాష్ట్రంలో మొబైల్ అంగన్వాడీ సేవల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని తెస్తున్నది. ఇదికూడా ఐసిడిఎన్ను నిర్వీర్యం చేసే చర్యలే. దీనివల్ల అంగన్వాడీ కేంద్రంలో టీచర్, హెల్పర్ అందించే సేవలు ప్రజలకు దూరమవుతాయి. వీటితోపాటు వచ్చే విద్యా సంవత్సరం నుండి రాష్ట్రంలో నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తున్నది. మొత్తంగా రాష్ట్ర ప్రభుత్వం ఐసిడిఎస్ ను ప్రైవేటీకరణ చేయాలని చూస్తున్నది. ఇవన్నీ అమలు జరిగితే రాష్ట్రంలో క్రమంగా ఐసిడిఎస్ బలహీనపడి శాశ్వతంగా మూతపడే ప్రమాదం ఉంది. పేద ప్రజలతో పాటు అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్కు నష్టం కల్గించే ఈ నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలి. ఐసిడిఎస్ ను యథావిధిగా కొనసాగించాలి. పై అంశాలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి. 24 రోజుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందపర్చిన హామీలు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోరాటాల సందర్భంగా ఇచ్చిన హామీలను, అంగన్వాడీలకు సుప్రీంకోర్టు, గుజరాత్ హైకోర్టు ఇచ్చిన తీర్పులను వెంటనే అమలు చేయాలని వీటి పరిష్కారం కోసం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో కేటాయింపులు పెంచాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెంజర్ల యాదయ్య

మహేశ్వరం, మార్చి 16,(ప్రజా కలం)

మహేశ్వరం మండల కేంద్రం అమీర్‌పెట్ గ్రామం బసవ జంగయ్య ఫంక్షన్ హాల్ సిద్దు అఖిల వివాహానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెంజర్ల యాదయ్య,పోరండ్ల గ్రామ ఇంద్రమ్మ కమిటీ అధ్యక్షుడు పెళ్లికూతురు పెళ్లి కొడుకు వధూవరులను పెంజెర్ల సిద్దు అఖిల ని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ,అమీర్‌పెట్ సోషల్ మీడియా అధ్యక్షులు ఎర్ర నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## టైలరింగ్‌లో శిక్షణకు పేర్లు నమోదు చేసుకోవాలి

అమలాపురం టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మహిళలకు భవిష్యత్తుపై భరోసా పెంచేలా స్వయం ఉపాధి పథకం కింద టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్నామని, ఆసక్తి ఉన్న మహిళలు తమ పేర్లను సంబంధిత సచివాలయాల్లో నమోదు చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు కోరారు. వెనుకబడిన తరగతుల వారితో పాటు ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందిన ఆర్యవైశ్య, రెడ్డి, క్షత్రియ, కమ్మ, బ్రాహ్మణ, కాపు సామాజిక వర్గాలకు చెందిన మహిళలు తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. 18 నుంచి 50ఏళ్లలోపువారు అర్హులని, తప్పనిసరిగా రైస్‌కార్డు కలిగి ఉండాలని, కమ్యూనిటీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, మొబైల్ నంబరుతో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని, నిష్ణాతులైన వారితో శిక్షణ అనంతరం కుట్టుమిషన్లు మంజూరు చేస్తామని కమిషనర్ తెలిపారు.

## ప్రభుత్వ బడిని బతికించుకుందాం

గవర్నర్‌పేట: 'ప్రభుత్వ బడి పట్ల విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం కలిగించేలా పనిచేసి, ప్రభుత్వ బడులను బతికించుకోవడానికి కృషి చేయండి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించే ప్రక్రియను ప్రారంభించండి.' అని ఉపాధ్యాయులకు రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పిలుపునిచ్చారు. యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఎంజీ రోడ్డులోని రాష్ట్ర కార్యాలయంలో విద్యారంగ సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎసఎస్ ప్రసాద్ ప్యానెల్ అధ్యక్షులుగా వ్యవహరించారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడారు. గత ప్రభు త్వం విద్యారంగ సంస్కరణల పేరుతో తెచ్చిన జీవో నెంబరు 117 కారణంగా 12,512 ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయని, 10 లక్షల మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు తరలిపోయారని ఆయ న ఆవేదన వ్యక్తం చేశారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీలు, ఉపాధ్యాయ సంఘాల డిమాండ్ వల్ల జీవోను రద్దు చేస్తామని ప్రస్తుత ప్రభుత్వం ప్రకటించిందన్నారు. జీవో నెంబరు 117 రద్దు చేసి మరో జీవో తేవడం కోసం చేస్తున్న కసరత్తులో విద్యారంగ సంస్కరణలు అమలు చేస్తోందని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి అన్నారు. విద్యారంగ సంస్కరణల వల్ల 1, 2 తరగతులు మాత్రమే ఉన్న ఫౌండేషన్ పాఠశాలలు 20 వేలకు పైగా పెరుగుతాయని తెలిపారు. భవిష్యత్తులో ఈ పాఠశాలలూ మూసివేస్తారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మోడల్ ప్రాథమిక పాఠశాలల పేరుతో మిగిలిన ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను మ్యాప్ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ద్వారా బలవంతంగా తీర్మానాలు చేయించడం సరికాదని మాజీ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. అన్ని హంగులతో మోడల్ పాఠశాలను నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. తీసుకున్న నిర్ణయాలను విద్యాశాఖా మంత్రి, ఎమ్మెల్యేలు, గ్రామ సర్పంచ్‌లు, విద్యాకమిటీ సభ్యుల వరకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, ఎస్ఎఫఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసన్న, అశోక్, యూటీఎఫ్ కార్యదర్శులు ఎస్పీ మనోహర్‌కుమార్, బి.సుభాషిణి, కేఏ ఉమామహేశ్వరరావు, ఎస్.కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

## వివాహేతర సంబంధం.. దాడి.. కానిస్టేబుల్ సస్పెండ్

పేరాల(చీరాల): వివాహేతర సంబంధం పెట్టుకుని ఆమె బంధువులపై ఘర్షణకు పాల్పడిన కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేయడంతో పాటు సస్పెండ్ చేశారు. ఈమేరకు జిల్లా అధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చీరాలకు చెందిన కానిస్టేబుల్ కొంత కాలంగా డీఎస్పీ కార్యాలయంలో కంప్యూటర్ విభాగంలో పనిచేస్తున్నాడు. ఇతనికి పేరాల్లోని ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉంది. ఈక్రమంలో రాత్రి ఆమె బంధువులతో తీవ్రంగా ఘర్షణ పడి చివరకు దాడులు చేసుకున్నారు. ఈక్రమంలో రెండు వర్గాల వారు ఏరియా హాస్పిటల్‌కు చేరి చికిత్స పొందారు. విచారణ చేపట్టిన అధికారులు అతనిపై కేసు నమోదు చేశారు. అంతేకాకుండా సస్పెండ్ చేశారు.

## పునరావాసం కల్పించి న్యాయం చేయండి

మైలవరం : దాల్మియా పరిశ్రమ వలన దుమ్ము, ధూళితో పంటలు పండక రోగాల బారీన పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్న మాకు పునరావాసం కల్పించి న్యాయం చేయాలని జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీకి దుగ్గనపల్లె గ్రామస్థులు మొరపెట్టుకున్నారు. ఈనెల 27న దాల్మియా రెండవ ప్లాంట్‌కు జరిగే ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో భాగంగా ప్రజాభిప్రాయాలను తెలుసుకునేందుకు దుగ్గనపల్లె గ్రామంలో మంగళవారం ఆర్డీవో సాయిశ్రీ పర్యటించి గ్రామ ప్రజల సమస్యలు, వారి బాధలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో గ్రామస్థులు మాట్లాడు తూ దాల్మియా పరిశ్రమకు తాము వ్యతిరేకం కాదని, దుమ్ము, దూళితోపాటు బ్లాస్టింగ్ వలన ఇల్లు నెర్రలు చీలడం, సాగు చేసిన పంటలపై దుమ్ము, ధూళి పడి దెబ్బతింటున్నాయని ధూళి కాలుష్యం వలన పిల్లలు అనారోగ్యం భారీన పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆర్డీవోకు వివరించారు. గ్రామానికి పక్కనే దాల్మియా పరిశ్రమ ఉండడంతో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందని మా గ్రామాన్ని వేరే చోటికి తరలించి మాకు పునరావాసం కల్పించిన తర్వాత మా భూములు దాల్మియా యాజమాన్యం కొనుగోలు చేయాలని వారు ఆర్డీవో కు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు లక్ష్మినారాయణ, డిప్యూటీ తహసీల్దారు, రెవెన్యూ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## ఆరుతడులకు నీరు అందించేందుకు ఏలూరి కృషి

పర్చూరు: ఆరుతడులకు నీరందించి రైతాంగాన్ని ఆదుకునే విధంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక దృష్టి సారించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొద్దిపాటి మరమ్మతులకు కూడా నోచుకోక అనేక లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరుణంలో నియోజకవర్గంలోని ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి తీసుకు వచ్చే విధంగా ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక చొరవ చూపారు.

# స్పీకర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జగదీష్ రెడ్డి దిష్టి బొమ్మ దగ్ధం

కూకట్ పల్లి, మార్చి16, ప్రజా కలం ప్రతినిధి:

బిఆర్ఎస్ నాయకులు అధికారం కోల్పోయి ఏం మాట్లాడుతున్నారో తెలియని పరిస్థితిలో పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బండి రమేష్



గారు విమర్శించారు. అసెంబ్లీలో స్పీకర్ ను ఉద్దేశించి మాజీ మంత్రి జగదీష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం బండి రమేష్ ఆధ్వర్యంలో బాలనగర్ శోభన సెంటర్లో జగదీష్ రెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు .ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఉన్నత స్థాయిలో ఉన్నవారు గౌరవ మర్యాదలు ఇచ్చి పుచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ దళిత స్పీకర్ను ఉద్దేశించి జగదీశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే బిఆర్ఎస్ నాయకులు ఇలా మతితప్పి మాట్లాడుతున్నారన్నారు.దిష్టి బొమ్మ దగ్ధం సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున బిఆర్ఎస్ కు వ్యతిరేకంగా, కాంగ్రెస్ పార్టీ జిందాబాద్ రేవంత్ రెడ్డి జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మార్కెటింగ్ కమిటీ మెంబెర్స్, టెంపుల్ కమిటీ మెంబర్స్, బ్లాక్ అధ్యక్షులు, బ్లాక్ మహిళా అధ్యక్షురాలు, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యూ ఐ నాయకులు, మైనారిటీ నాయకులు, ఎస్సి సెల్ నాయకులు, బీసీ సెల్ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సమస్యలే లేని నియోజక వర్గంగా కంటోన్మెంట్ ఫన్నులతో అభివృద్ధి పనులకు శ్రీకారం

కంటోన్మెంట్: మార్చి 17:
ప్రజాకలం ప్రతినిధి



ప్రజలు కట్టిన పన్నులతోనే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు ప్రజాప్రతినిధులు వెల్లడించారు. కంటోన్మెంట్ నియోజకవర్గం రెండో వార్డు సిబిఎన్ నగర్ లో బీరప్ప టెంపుల్, హనుమాన్ టెంపుల్ చర్చి రోడ్ లో, అర్జున్ నగర్లలో సుమారు 70 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ప్రతీ వార్డులోని సమస్యలను ఒక్కొక్కటి పరిష్కరిస్తూ సమస్యలే లేని నియోజకవర్గంగా కంటోన్మెంట్ ను తీర్చిదిద్దడమే తన లక్ష్యం అని ప్రజా ప్రతినిధులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ భానుక నర్మద మల్లిఖార్జున్, ఎమ్మెల్యే శ్రీగణేష్, స్థానిక ఎంపి ఈటెల రాజేందర్ స్థానిక బీజేపీ నేతలు కేశవ రెడ్డి, వంశ తిలక్,కాంగ్రెస్ నాయకులు శాంసన్ రాజు, మురళి, ఆంజనేయులు, బద్దం బల్వంతరెడ్డి, తౌఫిక్, మహేష్, నగేష్ యాదవ్, శ్రీహరి, జహంగీర్, నయీమ్, యాదగిరి, అజ్జు, కిషన్ , మల్లేష్, అరవింద్ యాదవ్, రేష్మ, సౌమ్య తదితరులతో పాటు పెద్ద ఎత్తున స్థానికులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ పార్టీ వార్షిక క్యాలెండరును ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

ప్రజా కలం ప్రతినిధి మెదక్ మార్చి 16 రేగోడ్ మండలం మర్పల్లి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ వార్షిక క్యాలెండరును అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ మండల పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతు రాష్ట్ర ప్రజలకు బిఆర్ఎస్ పార్టీ ఒక్కటే రక్ష అని తెలిపారు.కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రాన్ని పరిపాలించడానికి చేతకావడం లేదని కేవలం ప్రతిపక్షన్ని తిట్టడం చేతున్నారని అన్నారు. గతంలో యూట్యూబ్ ఛానల్స్ తో అధికారం లోకి వచ్చి నేడు అదే యూట్యూబ్ ఛానల్స్ లను అధికార మదంతో కేసులు పెట్టి బెదిరించి పాలన చేయాలనీ చూడటం విడ్డురంగా ఉందని అన్నారు. మీడియాను బెదిరింపులు చేస్తే వారికి బిఆర్ఎస్ పార్టీ అండగా ఉండి పోరాటం చేస్తామని తెలిపారు.బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలపై కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అక్రమంగా కేసుపెట్టి బెదిరింపులకు గురించేస్తుందని ఇది మంచి పద్ధతి కాదని ఎవరికి అధికారం శాశ్వతం కాదని ఇలాంటి చర్యలు మానుకోవాలని ప్రభుత్వంన్ని సూచించారు. రానున్న రోజుల్లో ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న బిఆర్ఎస్ పార్టీని అధికారంలోకి రావడం ఖాయమని కార్యకర్తలకు భరోసానిచ్చారు.ఈ కార్యక్రమంలో రేగోడ్ మండల బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వీహెచ్పీ బజరంగ్దళ్ ఆధ్వర్యంలో 'చావా సినిమా' ప్రదర్శన....



ఎల్లారెడ్డి మార్చి 16 ప్రజా కలం ప్రతినిధి : విశ్వహిందూ పరిషత్, బజరంగ్దళ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఎల్లారెడ్డి పట్టణంలోని మార్కెట్ హనుమాన్ మందిర్ లో చత్రపతి శంబాజీ మహారాజ్ జీవిత చరిత్రకు సంబంధించిన 'చావా సినిమా' ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించారు. ఈ సినిమా చూసేందుకు పట్టణానికి చెందిన యువకులు, చిన్నారులు, పెద్దలు, అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్, బజరంగల్ ప్రతినిధులు వినోద్ కుమార్, తులసి దాస్ లు మాట్లాడుతూ ఇప్పటి యువతరం హిందూ రాజుల జీవిత చరిత్రలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందులో భాగంగానే హిందూ రాజుల జీవిత చరిత్రను సినిమాల ద్వారా ప్రదర్శించడం జరుగుతుందన్నారు.

# సేవా పురస్కారం అవార్డు అందుకున్న మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి

మల్కాజిగిరి,మార్చి16 (ప్రజా కలం ప్రతి నిధి)



దక్షిణ భారతదేశంలో ప్రతీ ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడే సిఎస్ఆర్ సౌత్ ఇండియా సమ్మిట్ సేవ పురస్కారం అవార్డు ను నాచారం కు చెందిన మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి అందుకున్నారు.హైదరాబాద్ లోని శిల్ప కళా వేదికలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో తెలంగాణా ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్బాబు ప్రొఫెసర్ కోదండరాం, నటి పూనం కౌర్ మరియు పలువురు ఐఏఎస్ అధికారులు,పలు సంస్థలు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. సంతోష్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పరీక్షా కిట్లు మరియు స్టడీ మెటీరియల్ పంపిణీ తో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.సంతోష్ రెడ్డి చేస్తున్న సేవలను గుర్తించిన సి ఎస్ ఆర్ సమ్మిట్ నిర్వాహకులు సంతోష్ రెడ్డికి సేవా పురస్కారం అవార్డును అందించారు.

# చలో ఢిల్లీకి బయలుదేరిన ఖేడ్ ఎల్ఐసి ఏజెంట్లు

ప్రజా కలం ప్రతినిధి మార్చి 16 సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్: న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఎల్ఐసి ఏజెంట్ల జేఏసీ సంఘాల ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ఇచ్చిన పిలుపుమేరకు నారాయణఖేడ్ నుంచి ఎల్ఐసి ఏజెంట్లు ఆదివారం నాడు ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఈ నెల 19న ఢిల్లీలోని రామ్ లీలా మైదాన్ లో తలపెట్టిన కార్యక్రమ ధర్నా కార్యక్రమానికి దేశం నుంచి నలుమూలల నుంచి లక్షలాది మంది ఏజెంట్లు హాజరవుతున్నారు. ఎల్ఐసి పాలసీలపై పై విధిస్తున్న జీఎస్టీని రద్దు చేయడంతో పాటు బోనస్ తెంచాలని, 70 సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్న ఎల్ఐసి ఏజెంట్లు వ నిర్వహిస్తున్న వారికి తగ్గించిన కమిషన్ను యధావిధిగా కొనసాగించాలని వారు డిమాండ్ లో పేర్కొన్నారు. ఢిల్లీకి బయలుదేరిన వారిలో మాధవరావు తోట వెంకటేశం సంగారెడ్డి కాశీనాథ్ అలకరి దుర్గయ్య రామ్ చందర్ తుకారం తదితరులు పాల్గొన్నారు.




# సామాన్యుడి సంవేదనల అక్షరరూపం 'అలికిడి' పుస్తకం

సిద్దిపేట జిల్లా ప్రజాకలం ప్రతినిధి మార్చి 16.

"కవిత్వం అంటే ఉత్సవం కాదు. గాయాల గొంతుక" అంటారు ప్రముఖ కవి నందిని సిధారెడ్డి. స్పందించే మనసున్న మనిషి నుండి జాలువారే అక్షరాలు కవిత్వంగా రూపుదిద్దుకుంటాయి. రాసిన ప్రతి వాక్యం సమాజాన్ని కదిలించకపోవచ్చు. కానీ సామాజిక చైతన్యం, సమాజం పట్ల బాధ్యత కలిగిన మనుషుల మనసు పొరలని మాత్రం తప్పక కదిలిస్తాయి. కవిత్వం రాయడం ఒక సృజనాత్మక ప్రక్రియ అయినప్పటికీ, దాన్ని పుస్తక రూపంగా తీసుకురావడం మాత్రం ఆర్థిక సంబంధమైన అంశం. సమాజం పట్ల బాధ్యత కలిగి, తన స్పందనలని అక్షరాలలో బంధించి, కవిత్వంగా మలచిన యువ కవి కార్తీక రాజు పుస్తకం వెయ్యడానికి మాత్రం పురిటినొప్పులు పడ్డాడు. మొత్తంగా పుస్తకాన్ని మన ముందుకు తెచ్చి, తాను చెప్పదలుచుకున్న విషయాన్ని స్పష్టంగా మన కళ్ళ ముందుంచాడు. ఆధునిక పోకడల మూలంగా సమాజం పట్ల ఏమాత్రం బాధ్యత లేని, పెద్దల పట్ల గౌరవం లేని ఒక తరం పుట్టుకు వస్తున్న తరుణంలో కార్తీక రాజు లాంటి యువకుడు సమాజంలో మార్పు కోసం, యువత మత్తును వదిలించడం కోసం తన కవితాక్షరాలను ఆయుధాలుగా ఉపయోగించడం హర్షించదగ్గ విషయం.

ఓ అరదశాబ్ద కాలం పాటు సోషల్ మీడియాలో రాసినవి కొన్ని, కవి సమ్మేళనాల కోసం రాసినవి కొన్ని, మనసు చలించే ఘటనలు జరిగినప్పుడు స్పందించి రాసినవి కొన్ని... ఇలా అన్నీ కలిపి 'అలికిడి' పేరుతో పుస్తకంగా తీసుకువచ్చాడు కార్తీక రాజు. ఎలాంటి హంగు ఆర్భాటం లేకుండా సాగిపోయే తన జీవితం లాగానే పుస్తకాన్ని కూడా ఓ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టి తీసుకువచ్చాడు. ప్రతి పుస్తకానికి ముందుమాట ముఖద్వారంలా ఉంటుంది. కానీ ముందుమాట, కవిస్పందన లాంటివి ఏమీ లేకుండానే కేవలం కవితలతో పుస్తకం వేయడం అంటే ధైర్యంతో కూడిన పని. అలాంటి పని అలవోకగా చేసి నిరూపించిన ఈ యువ కవి ఇది మొదటి పుస్తకమే అయినప్పటికీ బలమైన కవిత్వంతో వచ్చాడు. 63 కవితలతో వేసిన ఈ పుస్తకంలో ఎన్నో అంశాలతో కూడిన కవితలున్నాయి. సబ్బండ వర్గాల శ్రామిక సౌందర్యానికి ప్రతీకలైన కవితలున్నాయి.

తన పొట్టకూటి కోసం మట్టిని నమ్మి, సమాజం ఆకలి తీరుస్తున్న రైతన్న గురించి మొదటి కవిత 'రైతు జీవన చిత్రం'లో పలవరిస్తాడు. "గిది మెతుకు కోసం పడే ఆరాటం / బతుకు కోసం చేసే పోరాటం" అంటూ రైతు తన ఆకలి తీర్చుకోవడానికి కాకుండా, సమాజం ఆకలి తీర్చడానికి జీవితమంతా పోరాటం చేస్తాడని చెప్తూ, తన అక్షరాలలో రైతు జీవన చిత్రాన్ని నిక్షిప్తం చేశాడు. రైతు జీవితం పట్ల అవగాహన, రైతు కష్టం పట్ల సానుభూతి ఈ అక్షరాల నిండా తొణికిసలాడుతున్నాయి.

తాను పుట్టి పెరిగిన పరిస్థితుల ప్రభావం ఏ కవి పైనైనా తప్పక ఉంటుంది. అట్లాగే తను చిన్నప్పటినుండి తల్లిదండ్రులు చేసిన వృత్తిపనిని ప్రత్యక్షంగా చూసినవాడు కాబట్టి యాంత్రికత దాడికి గురైన చాకిరేవును కవితా వస్తువుగా స్వీకరించాడు. "వాషింగ్ మెషిన్ లో బట్టల పోగులాడుతున్నట్టు చెదురుతున్న ఆశల గూడు నేటి చాకిరేవు "అంటూ యాంత్రీకరణ మూలంగా మాయమవుతున్న చాకిరేవు ఆత్మవేదనను 'చాకిరిబండ' కవితలో మన కళ్ళ ముందు ఉంచాడు.

తమ జీవితాన్ని ధారపోసిన తల్లిదండ్రుల త్యాగాన్ని స్మరిస్తూ 'అమృతం తాగని దేవతలు' అనే కవిత రాశాడు.

"నెత్తురు సచ్చిపోతున్నా
సత్తువ సదలి పోతున్నా
పిల్లల పూల పాన్పు కోసం
మెల్లమెల్లగా ముళ్ళ దారి మీదే వారి పయనం" అంటూ తమ పిల్లల కోసం తల్లిదండ్రులు చేస్తున్న త్యాగాల ఆనవాళ్ళను అక్షరాలలో నిక్షిప్తం చేసి, మన కళ్ళ ముందు ఉంచాడు.

సమాజం పట్ల బాధ్యత కలిగిన కవి ఇతడు. ఎక్కడ ఏ సంఘటన జరిగినా కదిలిపోతడు. కన్నీళ్లు సాకపోస్తడు. తన కలం ద్వారా ఆ ఘటన గురించి కవిత్వమల్లుతడు. అమాయక అడవిబిడ్డల జీవితం ఛిద్రమవుతున్నప్పుడు, పోడు భూముల విషయంలో ఆదివాసుల పై అటవీ అధికారుల దౌర్జన్యకాండ జరిపినప్పుడు 'తోకముడవండిక' అనే కవిత రాశాడు.

"తోక ముడవండిక
తెలతెల్లని అడవి మల్లెలన్నీ
ఎర్ర ఎర్ర బారక ముందే
కన్నెర్ర చేయకముందే" అంటూ అమాయక జీవుల ఆగ్రహం యొక్క తీవ్రత గురించి ప్రభుత్వాలను హెచ్చరిస్తున్నాడు.

ప్రపంచీకరణ మూలంగా ప్రాంతీయ మాతృభాషలు కనుమరుగవుతున్న తీరుపై కవి కలత చెందాడు. 'ఆత్మ భాష' అనే కవితలో "యాభై ఆరు అందమైన అక్షరాల ముత్యాలను / లోలోపల ఇమడుచుకున్న ఆల్చిప్ప "అంటూ తెలుగు భాష సౌందర్యాన్ని చెబుతూనే" మన తెలుగు భాష/ కావాలి మనందరి ఆత్మభాష" అంటూ తెలుగు భాష గుండె లోతుల్లోంచి మన భావాలను వ్యక్తపరుస్తుందన్న ఎరుకను నేటి తరానికి తెలియజెప్తున్నాడు.

ఓరుగల్లు దేశచరిత్రలో అజరామంగా వర్ధిల్లే ప్రదేశం. జన్మతః ఈ కవి ఆ మట్టి బిడ్డనే కాబట్టి 'విశ్వ కీర్తినొందిన చిహ్నాలు' అంటూ ఓరుగల్లు ఆనవాళ్ళయిన కాకతీయ శిలాతోరణ ద్వారాల గురించి కవిత్వమల్లిండు. ఈ కవితలో

"సుదీర్ఘ చరిత్రకు సుస్పష్ట ఆనవాళ్ళు
మహత్తర ఘట్టాలకు నిలువెత్తు సాక్ష్యాలు
తెలంగాణ రాజ్య రాజముద్రికలు
పోరాట స్ఫూర్తి నింపే సూత్రాలు
విశ్వ కీర్తినొందిన చిహ్నాలు" అని చాటాడు.

పసిపాపల నుండి పండు ముసలి దాకా వయసుతో సంబంధం లేకుండా రోజురోజుకు దేశంలో మహిళల పై పెరుగుతున్న అత్యాచారాలను గురించి కవి కలత చెంది కవిత్వం రాశిండు. 'అంగాలను తెగ్గోద్దాం పదండి' అన్న కవితలో అభం శుభం తెలియని చిన్నారులను చిదిమేస్తున్న కామాంధులను వ్యతిరేకిస్తూ రాసాడు. "నా శరీరాన్ని నలగ్గొట్టి/ నా హృదయానికి మూసుకుపోని తూట్లు పొడిచిన / ఆ నీచుల సంపర్కావయ ముండ్లను / పదునైన నాటు కొడవండ్లతో / తెగ్గోసి పారేయాలనిపిస్తుంది" అంటూ బాధిత స్త్రీల పక్షాన గొంతెత్తి నినదించాడు. రోజురోజుకూ మానవత్వం మాయమవుతున్న తరుణంలో కవి 'అసహ్యంగా ఉంది' అనే కవిత రాశాడు.


"అంతరించిపోతున్న
వృక్ష జంతు జాబితాలే కాదు
మానవ తత్వాల జాబితానూ
రూపొందించాల్సిన కాలమొచ్చింది" అంటూ
మానవత్వ విత్తనాలు చల్లాలని హితబోధ చేస్తాడు

ఆ బాధ్యతను కవి తన భుజస్కంధాలపై మోస్తున్నాడు. విద్య కార్పోరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిపోయాక సమాజంలో గురువు యొక్క స్థానం మస్కబారిపోయింది. విద్యార్థులకు జ్ఞానం అందించాల్సిన వాళ్లు కార్పోరేట్ కబంధహస్తాల కింద మరమనుషులుగా మారిపోయి, విలువలేని ర్యాంకుల కోసం తమ జీవితాన్ని ధారపోస్తున్నారు. అలాంటి వారి గురించి, విద్యావ్యవస్థలో గురువు స్థానం గురించి కార్తీక రాజు 'బజారు పాలైపోయింది' అన్న కవితలో తెలిపాడు. ముఖ్యంగా ప్రైవేట్ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల వెతలను గురించి చాలా చక్కగా వివరించాడు.

"వేతనం తక్కువ
వెతలు ఎక్కువ
చేస్తున్నది వెట్టి చాకిరి
జరుగుతున్నది శ్రమదోపిడి" అంటూ కార్పోరేట్ శక్తుల చేతుల్లో ఉన్న వ్యవస్థలో పొట్టకూటి కోసం ఉపాధ్యాయులు బతుకెల్లదీస్తున్న వాళ్ళ స్థితిని, వారి శ్రమదోపిడిని గురించి రాశాడు.

సోషల్ మీడియా ప్రభావం కారణంగా పుస్తక పఠనం దాదాపు కనుమరుగవుతున్న కాలంలో తన జీవితానికి దారి చూపిన పుస్తక పఠనం గురించి 'బతుకుదారి దీపాలు 'అనే కవిత రాశాడు. "నన్ను నడిపిస్తున్న బతుకుదారి దీపాలు పుస్తకాలు" అంటాడు కవి.

ఇలా పుస్తకంలో ఉన్న 63 కవితల్లో దేనికదే ప్రత్యేకమైనది. మనుషుల జాడ కోసం, మానవత్వపు నీడ కోసం పరితపిస్తున్నాడు ఈ కవి. సమ సమాజ నిర్మాణం కోసం కలగంటున్నాడు. బాధ్యత గల పౌరుడిగా సమాజ హితం కోరి, కవిగా తన ప్రయాణం కొనసాగిస్తున్నాడు. ఇంకా రాటుదేలి బలమైన అక్షరాలు కార్తీక రాజు కలము నుండి జాలువారాలి. ప్రస్తుతం తెలంగాణలో రాస్తున్న యువ కవులలో కార్తీక రాజుకు ప్రత్యేకమైన స్థానం ఉంది. దాన్ని నిలుపుకోవడానికి నిరంతర అధ్యయనం, మరింత చిక్కనైన పదాల అల్లిక కూడా అవసరం. ఆ దిశగా అతని ప్రయాణం కొనసాగాలని కోరుకుంటున్నాను.




పుస్తకం: అలికిడి (వచన కవితల సంపుటి)
రచయిత: కార్తీక రాజు
పేజీలు: 140
వెల: రూ. 100/-
ప్రతులకు: 8977336447

**చెన్న రాజు, సిద్ధిపేట**
**9908010610**

# అక్షర జ్ఞానంతోనే మహిళల చైతన్యానికి నాంది

**దళిత ఆదివాసి లేడీ ఎంటర్ ఫెన్యూర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బి.ఎన్ రత్న.**

సిద్దిపేట జిల్లా ప్రజాకలం ప్రతినిధి మార్చి 16.

అక్షర జ్ఞానంతోనే మహిళలు చైతన్యవంతులు అవుతారని ఆడపిల్లలు అందరూ చదువుకొని అందరూ ఎదగాలని సమాజంలోని పురుషులతో పాటు అన్ని రంగాలలో రాణించాలని దళిత ఆదివాసి లేడీ ఎంటర్ ఫెన్యూర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బి.ఎన్. రత్న, విద్యావేత్త డా. కొరవి వినయకళ అన్నారు. ఆదివారం స్ఫూర్తి భవన్ ఖైరతాబాద్, హైదరాబాద్ లో ఆదర్శ సేవా సమితి ఎన్జీవో ఆధ్వర్యంలో సుధామాల అంజలి కుమారి అధ్యక్షతన ప్రపంచ మహిళ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో సేవలు అందిస్తున్న మహిళలకు సన్మానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళలు పుట్టినప్పటి నుండి అనేక అవమానాలకు, దాడులకు,9 అత్యాచారాలకు గురవుతున్నారని మహిళలు అంటేనే బానిసలుగా చూస్తున్న ఈ దేశంలో మహిళా సాధికారత సాధిస్తేనే మహిళలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రతినిత్యం మహిళలపై దేశవ్యాప్తంగా ఎన్నో దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయని రోజు రోజుకి మహిళల పట్ల హింస పెరిగిపోతుందని మహిళలకు రక్షణ కరువైందన్నారు. లింగ వివక్ష లేకుండా స్త్రీ పురుషులకు సమాన హక్కులను కల్పించి స్వేచ్ఛాయుత వాతావరణంలో జీవించే విదంగా చూస్తే మహిళలు అన్ని రంగాలలో పురుషులతో పాటు సమానంగా అభివృద్ధి చెందగలుగుతారు. మహిళలంటేనే చిన్న చూపు చూస్తూ కేవలం పురుషులకు సేవ చేయడానికి, ఇంటి పని, పిల్లల ఆలన పాలన




చూసుకోవడానికి పరిమితం చేస్తున్నారు.భారతదేశ మొట్టమొదటి న్యాయశాఖ మంత్రిగా డా. బి.ఆర్ అంబేద్కర్ పార్లమెంటులో పురుషులతోపాటు సమానంగా మహిళలకు హక్కులు కల్పించాలని హిందూ కోడ్ బిల్లు ప్రవేశపెడితే మహిళల అభివృద్ధిని, మహిళ సాధికారత జీర్ణించుకోలేక ఆ బిల్లు వీగిపోయేటట్లు అప్పటి రాజకీయ నాయకులు చేయడం బాధాకరం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తీసుకువచ్చిన మహిళలపై దాడులు మాత్రం అరికట్టలేకపోతున్నారు. మహిళ సాధికారత సాధించి పురుషులతో పాటు సమానంగా చూసిన రోజే నిజమైన మహిళ దినోత్సవం అన్నారు. టియు జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, కళాకారుడు డోలక్ యాదగిరి వేముల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



# అట్టహాసంగా పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం

రాజన్నసిరిసిల్లా జిల్లా, మార్చి 16 (ప్రజా కలం ప్రతినిధి)

రాజన్నసిరిసిల్లా జిల్లా ముస్తాబాద్ మండలంలోని బదనకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన 2004-2005 పదవ తరగతి బ్యాచ్ కి చెందిన పూర్వ విద్యార్థుల ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం అట్టహాసంగా కొనసాగింది 2004-2005 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు ఈ సందర్భంగా ఆత్మీయ సమ్మేళనాన్ని ఆనందోత్సవాల మధ్య నిర్వహించారు 20 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలవడంతో వారి అనుభవాలను ఒకరినొకరు పంచుకున్నారు. ప్రస్తుతం వారు ఉంటున్న హోదాలను వేదిక ద్వారా పరిచయం చేసుకున్నారు. చదువుకున్న రోజుల్లో చేసిన చిలిపి చేష్టలను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు అలింగనాలు చేసుకున్నారు. పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనాన్ని పురస్కరించుకొని పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహా సమ్మేళనాన్ని పురస్కరించుకొని విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు సన్మానించు కున్నారు. 20 సంవత్సరాల తర్వాత ఒకే చోట చేరడంతో సందడి నెలకొంది. ఇకనుండి అందరూ టచ్ లో ఉండాలని తీర్మానించు కున్నారు. సమ్మేళనానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

# ఈసీఐఎల్ చౌరస్తాలో మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం

మల్కాజిగిరి,మార్చి 16(ప్రజా కలం ప్రతినిధి):

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ రావు ఏకవచనంతో దూషించిన మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి వైఖరిని నిరసిస్తూ ఆదివారం ఈసీఐఎల్ చౌరస్తాలో జగదీశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మ ను దగ్ధం చేశారు.కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ సీనియర్ నాయకులు కొత్త అంజిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి చర్లపల్లి కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ బొంతు శ్రీదేవి యాదవ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాదరావును వ్యక్తిగత దూషణలకు పాల్పడిన జగదీశ్వర్ రెడ్డి పై సస్పెన్షన్ విధించడం సమంజసమేనని అన్నారు.పార్టీ సీనియర్ నాయకులు కొత్త అంజిరెడ్డి మాట్లాడుతూ జగదీశ్వర్ రెడ్డి వైఖరి మొగుడిని కొట్టి మొగుసాలకు ఎక్కినట్లు ఉందని అన్నారు.అసెంబ్లీలో స్పీకర్ ను ఏకవచనంతో దూషించడమే కాకుండా ప్రజలను తప్పు దోవ పట్టించేందుకు బయటకు వచ్చి ఆందోళనలు చేయడం సిగ్గుచేటు అని అన్నారు.ఈ కార్యక్రమంలో



మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని రెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బొజ్జ రాఘవరెడ్డి, కె. సీతారాం రెడ్డి,చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి,సీనియర్ నాయకులు పెద్ది నాగరాజు గుప్తా,ఆల్లూరయ్య,పత్తి కుమార్,కాసుల పోశయ్య గౌడ్,మొసలి శ్రీనివాస్ రెడ్డి, పడమటి మల్లారెడ్డి,గోపాల్ యాదవ్,శ్రీకాంత్ రెడ్డి, ముదిగొండ లింగస్వామి, నాగశేషు,జి.సత్యనారాయణ,కిషోర్,కరీమ్,బాజీ భాష, నరసింహ,అరుణ్,బాల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## కొంపల్లిలో వినూత్న రుచుల వేదిక

# అంతేరా కిచెన్ & బార్..

**- కొంపల్లిలో నూతన AnTeRa కిచెన్ & బార్‌ను ప్రారంభించిన ప్రముఖ సినీ నటుడు నిఖిల్ సిద్ధార్థ..**

**- క్రమక్రమంగా అంతేరా శాఖలను పెంచుకోవడం సంతోషంగా ఉంది..**

**: సినీ నటుడు నిఖిల్ సిద్ధార్థ**



కొంపల్లి, మార్చి 16 (ప్రజా కలం ప్రతినిధి)

అసాధారణమైన వంటకాల అనుభవాలకు పర్యాయపదంగా పేరుగాంచిన AnTeRa కిచెన్ & బార్... నగరంలోని కొంపల్లికి తన పరిధిని విస్తరించింది. నగర నడిబొడ్డున తెలుగు రుచుల గొప్ప వైవిధ్యాన్ని పరిచయం చేసిన అంతేరా విభిన్న ప్రాంతాలకు విస్తరిస్తుంది. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ నటుడు నిఖిల్ సిద్ధార్థ.. ఈ పసందైన రుచులకు గ్లామర్ పెంచడంతోపాటు డెలిషియస్ సాయంత్రంగా మార్చారు.

తెలుగు సంస్కృతి, స్థానిక వంటకాల వారసత్వం యొక్క అద్భుత వేడుకగా నిలిచిన ఈ కార్యక్రమం.., రెడ్ కార్పెట్ స్వాగతం, విలాసవంతమైన విందులు, ఈ ప్రాంతం యొక్క ప్రామాణికమైన సారాంశంతో ప్రతిధ్వనించే వాతావరణం నెలకొల్పింది. కొంపల్లిలో కొత్త రెస్టారెంట్‌ను పరిచయం చేస్తున్నందుకు AnTeRa భాగస్వాములు ఆశిష్ రెడ్డి, అనురాగ్ రెడ్డిలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. AnTeRa అనే పేరు ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ వంటకాల సమ్మేళనాన్ని ప్రతిబింబిస్తుంది.

కొంపల్లిలో కొత్త శాఖను ప్రారంభించడం పట్లటాలీవుడ్ నటుడు నిఖిల్ సిద్ధార్థ తన ఉత్సాహాన్ని వ్యక్తం చేస్తూ., AnTeRa కుటుంబంలో భాగమైనందుకు, క్రమక్రమంగా మరొక శాఖను ప్రారంభించడం నాకు చాలా సంతోషంగా ఉంది. అంతేరా వ్యవస్థాపకులు ఇంత తక్కువ వ్యవధిలో శాఖలను పెంచుకోవడం నేను చూశాను. ఈ నేపథ్యంలో మొత్తం AnTeRa బృందానికి శుభాకాంక్షలు. రాబోయే సంవత్సరాల్లో వారు మరింత అభివృద్ధి చెందుతూ వారి విస్తరణను కొనసాగించాలని కోరుకుంటున్నాను. AnTeRa ఖచ్చితంగా నగరంలోని ఆహార ప్రియులకు ఒక ప్రసిద్ధ ప్రదేశం. వారు తెలుగు రాష్ట్రాలలోని ప్రతి ప్రాంతం నుండి వైవిధ్యమైన అనేక రకాల వంటకాలను అందిస్తార" తెలిపారు.

AnTeRa కిచెన్ & బార్ భాగస్వాములలో ఒకరైన ఆశిష్ రెడ్డి మాట్లాడుతూ., "కొంపల్లికి తెలుగు వంటకాల రుచులను తీసుకురావడానికి మేము సంతోషిస్తున్నాము. AnTeRa కేవలం రెస్టారెంట్ మాత్రమే కాదు... ఇది మూడు తెలుగు ప్రాంతాల గొప్ప వారసత్వ ప్రయాణానికి ప్రయత్నానికి నిదర్శనం. మేము పురాతన వంటకాలు, పురాతనమైన రుచికరమైన వంటకాల మెనూను క్యూరేట్ చేసాము. మీ ఆహార ఆసాధనకు మరపురాని సాహసయాత్రను పరిచయం చేస్తామని" అన్నారు.

"తెలుగు సంప్రదాయాల ఆత్మను ప్రదర్శించే ఆహ్వానించే వాతావరణాన్ని అందించడమే మా లక్ష్యం" అని AnTeRa భాగస్వామి అనురాగ్ రెడ్డి అన్నారు. వంటకాలపై నిశితమైన శ్రద్ధ, మా పాక శాస్త్ర మూలాల పట్ల లోతైన మక్కువతో, మేము ఆధునిక, ప్రామాణికమైన భోజన అనుభవాన్ని రూపొందించామని ఆయన వివరించారు.

కొంపల్లిలోని AnTeRa కిచెన్ & బార్ ఒక కిచెన్ ల్యాండ్‌మార్క్‌గా మరియు తెలుగు వంటకాల యొక్క విశిష్టమైన నోరూరించే రుచులను ఆస్వాదించడానికి ఒక ప్రదేశంగా ఉంటుందని హామీ ఇస్తుంది.





# మల్కాజిగిరిలో మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి కేటీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం

మల్కాజిగిరి,మార్చ్16,(ప్రజా కలం ప్రతినిధి)

దళిత స్పీకర్ ను అవమానించిన జగదీశ్వర్ రెడ్డి,కేటీఆర్ లు వెంటనే క్షమాపణ చెప్పాలని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంతరావు డిమాండ్ చేశారు.స్పీకర్ ను అవమానించడాన్ని నిరసిస్తూ మల్కాజిగిరి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమానికి మైనంపల్లి హనుమంతరావు హాజరయ్యారు.జగదీశ్వర్ రెడ్డి,కేటీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.కేటీఆర్ జగదీశ్వర్ రెడ్డి కెసిఆర్ డౌన్డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్,నాయకులు బీ కే శ్రీనివాస్,ఎ.జీవన్ రెడ్డి,గుండా నిరంజన్,పిట్టల శ్రీనివాస్,రాందాస్ సంతోష్ ముదిరాజ్,బాబు, సత్యనారాయణ,సంపత్ రావు,డివిజన్ అధ్యక్షులు సంపత్ గౌడ్,వినోద్ యాదవ్, వైనాల ప్రవీణ్,ఉమేష్ సింగ్,ఆశా,విజయ లక్ష్మి,ప్రభ,ఎస్ ఆర్ ప్రసాద్,నాగరాజు,సనాధి శంకర్,పిట్టల నాగరాజు, వెంకటేశ్వరరావు,కుట్టి శ్రీనివాస్, ఇస్తారి,కన్నా,కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

# స్థానికులకే ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలి

## మామిడిపల్లి గ్రామస్తుల ఇబ్బందులను పరిష్కరిస్తాం

## మహేశ్వరం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

**మహేశ్వరం, మర్చి 15,(ప్రజా కలం)**

మహానగరంగా మారుతున్న మహేశ్వరం నియోజకవర్గంలో ప్రైవేటు కంపెనీల్లో స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కోరారు.ఇళ్లు, స్థలాలు ఎయిర్ పోర్ట్ కోసం త్యాగం చేసినా మాకు ఇంకా న్యాయం జరగలేదని మహిళలు మొరపెట్టుకున్నారు. తుక్కుగూడ కార్యాలయంలో అనేక సమస్యలతో జనం బారులు తీరారు.వారి సమస్యలను సావదానం విన్నా



కేఎల్ఆర్... వెంటనే అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని కోరారు.అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని కిచ్చెన్న హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేవ భాస్కర్ రెడ్డి సహా పలువురు పాల్గొన్నారు.

# మహేశ్వరం మండలానికి అన్యాయం చేస్తే ఊరుకోం

**అఖిలపక్షకులు నాయకులు ఆగ్రహం**
**మహేశ్వరం అభివృద్ధి కోసం పార్టీలు పక్కన పెట్టి రంగంలోకి దిగిన అఖిలపక్షం**
**మహేశ్వరంలో ఉన్న అన్ని గ్రామాలు ఫ్యూచర్ సిటీ లో విలీనం చేసే వరకు పోరాటం**
**మహేశ్వరంలో ఉద్యమానికి నాంది పలికి నాకలాపక్ష నాయకులు**
**మహేశ్వరం మండలంలో నాయకులు లేరా అనుకున్నారా ఉద్యమం చేయలేర అనుకున్నారా...**
**మహేశ్వరానికి అన్యాయం జరుగుతుంటే స్థానిక ఎమ్మెల్యే కు పట్టదా**
**అన్ని మండలాలు మున్సిపాలిటీగా చేస్తే మహేశ్వరం ఏం పాపం చేసింది**
**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దగ్గరికి మన సమస్యలు చెప్పడంలో విఫలం**
**మాజీ హోం మంత్రి దేవేందర్ గౌడ్ లేని లోటు కనిపిస్తుంది**
**ఆర్డీవో కార్యాలయం ఉన్నది మహేశ్వరం పేరు ఉన్నది కందుకూరులో**
**డిసిపి ఏసిపి కార్యాలయం మహేశ్వరం పేరు**
**ఉన్నది తుక్కుగూడలో ఇలా ప్రభుత్వ కార్యాలయాలు పేరు మహేశ్వరం ఉన్నవి మరోచోట**
**మహేశ్వరం పై చిన్న చూపేందుకు**
**ఫ్యూచర్ సిటీ లో మహేశ్వరంలో ఉన్న అన్ని గ్రామాలు విలీనం చేసే వరకు పోరాటం**
**మహేశ్వరం అభివృద్ధి కోసం జెండాలు పక్కనపెట్టి అజెండా ఒక్కటే ముఖ్యం**
**మహేశ్వరం అఖిలపక్షం నాయకులు**



మహేశ్వరం, మర్చి 16,(ప్రజా కలం)

మహేశ్వరం మండలానికి అన్యాయం చేస్తే ఊరుకోం అని అఖిలపక్షకులు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలో కర్నాటి మనోహర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అఖిలపక్షం నాయకుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీనియర్ జర్నలిస్టు ఒత్తుల రఘుపతి అధ్యక్షతన వహించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి నాయకులు బి ఆర్ ఎస్ నాయకులు కమ్యూనిస్టు పార్టీ నాయకులు బీఎస్పీ నాయకులు ఇతర మేధావులు రాజకీయ నాయకులు అందరూ కూడా మహేశ్వరంలో మహేశ్వరం మండల అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని ఒక నిర్ణయానికి రావడం జరిగింది మహేశ్వరం మండలంలో ఉన్నటువంటి అన్ని గ్రామాలను కూడా ఫోర్త్ సిటీలో విలీనం చేస్తూ మరొక ప్రత్యేక జీవో తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఫోర్త్ సిటీ లో మహేశ్వరం లో ఉన్న అన్ని గ్రామాలు కలిపే వరకు ఉద్యమం చేయాలని అందరూ అన్ని పార్టీల నాయకులు అన్ని పార్టీల్లో ఉన్నటువంటి ప్రజా ప్రతినిధులు అందరు కూడా పనిచేయాలని అఖిలపక్షం నాయకులందరూ కలిసి నిర్ణయించారు. మహేశ్వరం ప్రాంత అభివృద్ధి కోసం ఏ ఉద్యమానికైనా సిద్ధం కావాలి పార్టీలు జెండాలను పక్కనపెట్టి అందరం ఒక ఐక్యవేదిక ఏర్పాటు చేసి నేటి తరం కాకుండా మన పిల్లలు తరం కోసం ఈ ఉద్యమానికి ఈ కార్యక్రమనకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించుకోవడం జరిగింది. ఆయా పార్టీలో ఉన్న కేంద్రం బిజెపి నాయకులు, రాష్ట్రంలో కాంగ్రెస్ మంత్రుల దృష్టికి స్థానికంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేఎల్ఆర్ దృష్టికి స్థానిక శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి గురించి కూడా తీసుకొచ్చి భవిష్యత్తు కార్యాచరణ ఏర్పాటు చేయాలని అన్నారు.

ఈనెల 18వ తేదీన మంగళవారం కాకి ఈశ్వర్ ముదిరాజు ఫంక్షన్ హాల్ లో ఒక ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకోవడానికి మహేశ్వరం మండలా అఖిలపక్ష కార్యచరణ ఐక్యవేదికగా కమిటీని కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. మహేశ్వరం అభివృద్ధి లక్ష్యంగా అన్ని గ్రామాలను ఫోర్త్ సిటీలో కలిపే వరకు అన్ని పార్టీల నాయకులు పార్టీలను పక్కనపెట్టి పార్టీలకు అతీతంగా అఖిలపక్షంగా ఏర్పడి ఉమ్మడి జేఏసీ ఏర్పాటు చేసుకొని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. మహేశ్వరం అభివృద్ధి కాకుండా కుట్ర జరుగుతుందని అఖిలపక్షం నాయకులు ఆ గ్రామస్తులు చేశారు.ఈ కార్యక్రమంలో మల్లేష్ యాదవ్. కాకీ ఈశ్వర్ ముదిరాజ్. లాజర్. కర్రల చంద్రయ్య. కర్నాటి మనోహర్. బిజెపి మండల అధ్యక్షుడు యాదగిరి. పాపయ్య గౌడ్. ఎం సుదర్శన్ రెడ్డి, రాజు నాయక్, కడారి జంగయ్య, మాజీ ఎంపీటీసీ సుదర్శన్ యాదవ్. శ్రావణ్ కుమార్,గ్రామ శాఖ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, ఆంజనేయులు గౌడ్, మాజీ సర్పంచ్ రమేష్, నరసింహ, దేశ నాయక్, దత్తు నాయక్, సుభాష్, నారాయణ, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **Kalakonda Ramakrishna**, Printed at M/s. Swetha Offset Printers, H.No. 2-10-92, Weekly Bazar, Boigally, Nizamabad-503001, Telangana State and Published from H.No. 2-10-92, Weekly Bazar, Boigally, Nizamabad-503001, Telangana State, Editor: **Kalakonda Ramakrishna**, RNI. Regn.No. TELTEL/2010/33275, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com